ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూలై 05, 2015

ఆమెకు ఆమే సాటి

# ఈ వాతావరణానికి ఏమైంది !

# షాహిద్ షాదీ

**బా**లీవుడ్ బ్యాచిలర్ బ్యాచికి షాహిద్ కపూర్ బైబై చెప్పే రోజు వచ్చేసింది. ఢిల్లీ పిల్ల మీరా రాజ్‌పుట్‌ను ఈ యువ కథానాయకుడు పెళ్లి చేసుకోబోతున్నాడు. గత కొద్ది రోజులుగా వీరి షాదీ కథనాలు ప్రసార మాధ్యమాల్లో వస్తూనే వున్నాయి. ఔత్సాహిక అభిమానులు చదువుతూనే వున్నారు. పెళ్లి వేదిక మొదలుకొని, విందులో వడ్డించే పదార్థాలు, హాజరయ్యే అతిథుల వరకు అన్నీ ఆసక్తికరమే. ఆ వివరాలు...

★ జీవిత భాగస్వాములు కానున్న షాహిద్ కపూర్ (34) మీరా రాజ్ పుట్ (21) మధ్య పదమూడేళ్ల అంతరం వుంది.

★ బ్యాచిలర్స్ పార్టీని గ్రీస్‌లో గ్రాండ్‌గా ఇద్దామనుకున్నా... పనుల వత్తిడితో దాన్ని రద్దు చేసేశాడు. దాంతో సన్నిహిత మిత్రులు నిరాశకు గురయ్యారట. పెళ్లి తర్వాత అంతకంటే మంచి పార్టీ ఇస్తానని వారిని శాంతింప చేశాడట షాహిద్.

★ వధూవరుల పెళ్లి బట్టల బాధ్యతను మసాబా గుప్తా తీసుకుంది. వివాహ సందర్భంగా మీరా ఏర్పాటు చేసుకున్న డిజైనర్లలో ఆమె కూడా ఒకరు. షాహిద్ కోసం కూనల్ రావల్ ప్రత్యేక శ్రద్ధతో బట్టలు డిజైన్ చేయిస్తున్నాడు.

★ వివాహానంతరం నూతన వధూవరులు ఎక్కడ స్థిర పడతారనేది ఆసక్తికరంగానే మారింది. మీరాకు మాత్రం మనసంతా ముంబై మీదే వుందట. అక్కడ షాహిద్ అపార్ట్‌మెంట్‌ను తీర్చిదిద్దే పని కూడా అవుతోంది

★ నిత్యం సినిమాలు, షూటింగులతో బిజీగా వుండే తారలు పెళ్లయిన వెంటనే విదేశాలకు చెక్కేయడం చూస్తుంటాం. అయితే ఈ జంటకు హనీమూన్ వుండకపోవచ్చు. పెళ్లి, రిసెప్షన్ అయిన వెను వెంటనే షాహిద్ షూటింగ్‌లలో పాల్గొనాలనుకుంటున్నాడట. ఇప్పటికే చేస్తున్న చిత్రాల షూటింగులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసుకుని కుటుంబంతో గడపాలన్నది అతని ఆలోచన. బుల్లి తెరపై తొలిసారిగా జడ్జిగా వ్యవహరిస్తున్న రియాలిటీ డాన్స్ షో 'ఝలక్ దిక్లా జా'ను కూడా అదే స్ఫూర్తితో పూర్తి చేస్తున్నాడు.

★ కాబోయే భార్యకు షాహిద్ ఖరీదైన బహుమతి ఇచ్చేశాడ్సడే. 23 లక్షల రూపాయల విలువ చేసే ఉంగరాన్ని మీరాకు ప్రేమతో బహూకరించాడు.

★ ఇక వివాహానికి ఎవరెవరిని పిలుస్తారనేది కూడా పెద్ద వార్తే. అత్యంత సన్నిహితులైన నలభై మందిని మాత్రమే ఆహ్వానించనున్నారు. అయితే రిసెప్షన్ మాత్రం ఘనంగా వుంటుంది. తనకు పరిచయమున్న బాలీవుడ్ ప్రముఖులను, సహ నటీనటులను పేరు పేరునా పిలవనున్నాడు షాహిద్.



★ పెళ్లికి సంబంధించి కాబోయే వధూవరులుకానీ, కుటుంబ సభ్యులు కానీ పెదవి విప్పడం లేదు. ఇవన్నీ మీడియాలో హల్‌చల్ చేస్తున్న విషయాలే.

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

# దుమ్ము దులుపు

శిరస్త్రాణం! హెల్మెట్! ఇనుప కవచం! ఏ పేరుతో పిల్చుకున్నా అవుననదు. కాదనదు. మూకుడును పోలిన ముచ్చటైన రక్షణ కవచం .. మళ్లీ పతాక శీర్షికలకెక్కింది! బ్రేకింగ్ న్యూస్ అయింది. ద్విచక్ర వాహన చోదకుల గుండెల్లో గుబులు రేపే అంశమైంది. అయిష్టంగా అయినా తప్పనిసరిగా కొనాల్సిన వస్తువైంది.

టూ వీలర్ నడిపే వారు హెల్మెట్ పెట్టుకోవాల్సిందే అని అధికారుల హుకుం! ఇనుప కవచం ధరించని పక్షంలో జరిమానా జరూర్! అందుకే అటకెక్కించిన హెల్మెట్ల దుమ్ము దులిపే ఆలోచన చేయక తప్పట్లేదు. అంతేకానీ... హెల్మెట్ లేకపోవడం వల్ల కలిగే అనర్థాల గురించి ఎలాంటి భయమూ లేదు. చిన్నదో చితకదో దుర్ఘటన జరిగితే అయ్యే ఆస్పత్రి బిల్లు మీద బెంగా లేదు. టైమ్ బాగోకపోతే ప్రాణం మీదకొస్తుందన్న చింతా లేదు.

✧ ✧ ✧

కానీ ఎక్కడో ఏదో గిలి. మనసుకు నచ్చిన మరెన్నిటినో వదులుకోవాల్సి వస్తుందన్న గిలి గిలి. షాంపూలు, కండిషనర్లతో పెంచి పోషించిన వెంట్రుకలను... డ్రై పూసి, స్ట్రెయిట్‌నర్లతో సోగ్గా సాగదీసిన కేశాలను... హీరోల్లా అలా గాల్లోకి స్వేచ్ఛగా విడిచిపెట్టకుండా...ఇనుప మూకుడు మాటున దాచాలన్న అప్రియ ఆలోచనతోనే తంటా అంతా. గంటల తరబడి సమయం వెచ్చించి పోషించిన జుత్తంతా హెల్మెట్ల కింద పడి నలిగిపోవడం, దాగిపోవడమూ నచ్చదు యంగ్ హీరోలకు.

'ఏమీ కాదులే' అన్న మితిమీరిన ఆత్మవిశ్వాసంతో రోడ్డు భద్రతా నియమ నిబంధనలను ఉల్లంఘించేస్తుంటారు. పొరపాటున శిరస్త్రాణాన్ని వెంట తీసుకెళ్లినా అది అసలు సిసలు స్థానంలో కానరాదు. బైకు హ్యాండిల్‌కో, వెనక సీటుకో వేళ్లాడుతూ వెక్కిరిస్తుంటుంది. అదీ ఇదీ కాకపోతే వెనక సీటులో కూర్చున్న వారి చేతిలో కూరల బుట్టగా మారుతుంది గడుసుగా. కోడిగుడ్లకు ట్రే అవుతుంది అమాయకంగా.

✧ ✧ ✧

ఇవన్నీ చెప్పకోడానికి కొంటెగా ... చదవడానికి తమాషాగా... అనిపించినా... ఒక జీవితానికి సంబంధించిన విషయం... చట్ట సంబంధ అంశం పట్ల ఇంత తేలిక భావం ఎందుకో తప్పక ఆలోచించాల్సిందే. వాహన చోదకులు, అధికారులు, ప్రభుత్వం ... యోచించాల్సిందే. ఏ నిబంధనైనా సరే మూన్నాళ్ల ముచ్చటగా... పదహారు రోజుల పండుగలా కాకూడదు. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగకూడదంటే తాగకూడదంతే. కారుల్లో సీటు బెల్టులు పెట్టుకోవాలన్నది నిబంధన అయితే. అమలు చేయాల్సిందే. అధికారులు, పౌరులు దాన్ని విధిగా పాటించాలి. అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి. దైనందన జీవితంలో అదో అంతర్భాగం కావాలి. అప్పడే మార్పు కనిపిస్తుంది. అనుకున్న ఫలితం లభిస్తుంది. కాకపోతే అధికారులు పెట్టిన నిబంధనలు ప్రజలను పీడించేట్లుండకూడదు. హెల్మెట్ల విషయంలోనూ అంతే. ఏడాదికోసారో, రెండేళ్లకోమారో 'తప్పనిసరి' అంటూ రూల్సు పెట్టినట్టు పెట్టడం, అమలుకు సైతం వాయిదాల మీద వాయిదాలు వేయడంతో పాటించేవారిలోనూ పట్టుదల వుండదు. కథ మళ్లీ మొదటికే వస్తుంది. దీనికి తోడు ట్రాఫిక్ పోలీసుల వసూళ్ల దందాలు. యథా అధికారులు. తథా ప్రజలు. వంద రూపాయలు లంచం ఇస్తే సరిపోతుంది కదా అనుకుంటే ప్రజలు నిబంధనలెందుకు పాటిస్తారు! అందుకే అన్ని వైపులా చిత్తశుద్ధి వుంటేనే ఏదైనా సాధించగల్గుతాం. అందుకు పౌరులుగా మన వంతు బాధ్యత మనం నెరవేర్చుదాం.

■

◆ మనలో మాట

# టపా

## ఆమె ఎందరికో స్ఫూర్తి

అప్పట్లో కుటుంబ కథా చిత్రాలు ఎక్కువ. వాటిల్లో తల్లి, అక్క పాత్రలకి శాంతకుమారి సహజంగా చాలా హోమ్లీగా కనిపించేవారు. శరీర మార్పు కోసం విదేశాల్లో ప్లాస్టిక్ సర్జరీలు కామన్ అయ్యాయి. చిరిగిన ట్రౌజర్లు, పొట్టి నిక్కర్లు ప్రస్తుత సినిమాల్లో ఫ్యాషనుగా మారాయి. ఆఫ్ఘన్‌లో మత చాందసులు, తాలిబన్ల బెదిరింపులకు భయ పడక సారా బహాయ్‌లు టాక్సీ డ్రైవరుగా జీవనోపాధి పొందుతూ తోటి స్త్రీలకు అదే బాటలో ఉపాధి చూపిన తెగింపు ఎందరికో స్ఫూర్తి . స్వీడెన్‌లో మరగుజ్జులను ఆడిస్తూ ఆనందిస్తున్న ధనిక వర్గం ఒకటి తయా రైందని చదివి బాధపడ్డాం. అయితే అలాంటి వారి చిల్లర పనుల్ని మానవ హక్కుల సంఘం అడ్డుకోవడం అభినంద నీయం.

**టి. సత్యనారాయణ మూర్తి, మల్లాపురం, విశాఖ.**

## సంస్కరణాలయం

జైపూర్‌లోని ఓపెన్ ఎయిర్ జైలు దేశంలోనే గొప్ప సంస్కరణాలయం. ఓపెన్ ఎయిర్ జైలులో సత్ ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీలు మాత్రమే వుంటారు. వాస్తవానికి వీరిలో 7 సంవత్సరాల శిక్ష అనుభవించిన వారు క్షమాభిక్షతో విడుదలకు అనర్హులు. కాని తమిళనాడులో వెల్లూరు జైలులో వున్న రాజీవ్ గాంధీ హత్య కేసులో శిక్షపడిన ఖైదీల విడుదల విషయంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని దేశవ్యాప్తంగా జైళ్లలో వున్న జీవిత ఖైదీలందరికి వర్తింపచేసే విధంగా ఆదేశాలు జారీ చేసినందున వేలాదిమంది సత్ ప్రవర్తన కల్గిన జీవిత ఖైదీలు అర్హులైనప్పటికి విడుదల కాకుండా జైళ్లలో మగ్గుతున్నారు.త

**టి.శ్రీరామమూర్తి, విశాఖ.**

## అచ్చు

మనిషి ఆశకు హద్దు ఉండదు. బార్బీ బొమ్మకు ఎంత క్రేజ్ ఉందో ఈనాడు అందరికి తెలిసింది. బార్బీ మాదిరిలాగే ఉండాలని చాలా మంది శస్త్రచికిత్సలు చేసుకుంటున్నారు. ఆ విషయంలో కొన్ని సార్లు వారి ప్రణాలమీదకు తెచ్చుకుంటు న్నారు. వీరిని చూసైనా అలాంటి ఆలోచనలు వున్నవారు జాగ్రత్త పడాలి.

**గోపి, విశాఖ.**

## భలే విశ్వాసం

జంతువులు విశ్వాసంగా ఉంటాయని చెప్పడానికి ఈ తాబేలే ఉదాహరణ. మరగుజ్జులను ఆడించి వినోదించడాన్ని చూస్తే మనిషి వింత పోకడకు హద్దు లేకుండా పోతుంది అని చెప్పొచ్చు. సొసైటీలో మనిషికి ఎంత విలువ ఇస్తారో వీరిని చూస్తే అర్థం అవుతుంది. ఈ వారం నవ్వుల్-పువ్వుల్ బాగున్నాయి.రాజస్థాన్ అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది అలనాటి రాజుల వైభవం, ఎడారి ప్రయా ణం, అక్కడి ప్రజల ఆచార వ్యవహారా లు... ఇవే మన కళ్ల ముందు అగుపిస్తాయి.

**విజయ్, మచిలీపట్నం.**

## ముచ్చటైన మూడు అంశాలు

ఆదివారం సంచికలో మూడు కథనాలు మనసును విపరీతంగా ఆకట్టుకున్నాయి. జో జోయాల కథ, ముళ్ళపూడి వారి స్మరణ అలనాటి అందాల నటుడు హరనాథ్ గురించిన కథనం బాగున్నాయి. హరనాథ్‌ను చివరి రోజుల్లో నరసరావు పేటలో మాకు తెలిసిన ఇంజనీర్ గారింట్లో చూశాను. శిథిలమై పోయిన చంద్రబిం బంలా ఉన్నాడు. మనిషి ఇంకా మరణిం చలేదని జోయాల కథ చెబుతుంది.

**రాఘవేంద్ర శ్రీనివాస్, మచిలీ పట్నం (ఈ-మెయిల్)**

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజమాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

## ఈ సంచికలో....

### ఈ వాతావరణానికి ఏమైంది !

కవర్ స్టోరీ ——— 14

వానాకాలంలో సరైన వానలు రావు. అలాగని రాకుండా వుండవు. అకాల వర్షాలు కురుస్తాయి. ఒకవేళ సకాలంలోనే వర్షాలు పడ్డా కుంభవృష్టిని చవి చూపిస్తాయి. తుపాన్లు చీటికీ మాటికీ వచ్చి భయపె డుతుంటాయి. వరదల సంగతి సరేసరి. వేసవిలో ఎండలు విపరీతంగా పెరిగి పోతాయి. వడగాల్పుల విషయం చెప్పే దేముంది? పిలవని అతిథుల్లా ఎప్పుడు పడితే అప్పుడు వచ్చి మీద పడుతుంటాయి. ఈ వాతావరణానికి ఏమైంది? ఎందుకిలా మారిపోతోంది ? వాటి ప్రభావం మన మీద, మన ఆరోగ్యం మీద ఎలా వుంటుంది? వంటి అనేక అంశాలు ఈ వారం అట్టమీది కథలో.

ప్రత్యేకం .............................................. 3
వాన కోసం రక్తం

నవ్వుల్ పువ్వుల్ .............................................. 4

తెలుసా .............................................. 5
నలుపు & తెలుపు

సినిమా కబుర్లు .............................................. 6
ఆమెకు ఆమే సాటి !

వింత లోకం .............................................. 8
స్నిఫ్ఫర్ ఎలుకలు

టెక్ గురు .............................................. 9
ఆ ఏడుగురు !

చూద్దామా .............................................. 10
పూవుల్లో దాగున్న లోయ

కథ .............................................. 18
కిస్సా -కుర్సీకా

బాలనేస్తాలు .............................................. 22
ప్రపంచంలోకెల్లా పొట్టి ఆవులు

కొత్త పుస్తకాలు .............................................. 24
ఛిద్రమవుతున్న గ్రామీణ జీవన దర్పణం

నమస్తే ఇండియా ...................... 17

సినిమా చూపిస్తా మామా... - 12

ఓ వైపు వరద.. మరో వైపు చినుకు రాలదు. కారణం వాతావరణంలో వస్తున్న అనూహ్య మైన మార్పులంటే వారికి పట్టదు. వాన చినుకు కోసం ముష్టి యుద్ధాలు, కొరడా దెబ్బలు, జంతు బలులు, మానవ రక్తతర్పణ ఆచారాలను నిరాఘాటంగా సాగిస్తూనే వున్నారు.

# వాన కోసం రక్తం

కొన్ని ఊళ్లల్లో కప్పలకు పెళ్లిళ్లు చేస్తారు. చెట్లకు అక్షింతలు వేస్తారు. ఆఖరుకు నీళ్లలో నానుతూ వాన నీటి కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తారు. దీన్నంతా పై నుంచి నీటి ఆవిరి చూసి శాంతించి చల్లబడి చినుకు రాలుతుందని పిచ్చి ప్రయత్నం. ఈ ప్రయత్నాలే శృతి మించి రక్తానికి వాన చుక్కకు లింకు పెట్టేశాయి. కేవలం మన దేశంలోనే కాదు, మన ఆచారాల్లోనే కాదు.. కరడుగట్టిన వ్యవహారాలు ప్రపంచమంతా ఉన్నాయి. వీటిలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది మెక్సికన్ మారు మూల గ్రామాల గురించి. అక్కడ ఈ పట్టింపులు మరీ ఎక్కువ. పట్టణాలుగా వృద్ధి చెందిన ప్రాంతాల్లో సైతం వాన కోసం రక్తం ధారబోయడం షరా మామూలు. అక్కడ వర్షాకాలమైన మే మాసం ప్రారంభంలో ఈ ఆచారాలు వీధులకెక్కుతాయి. సరిహద్దుల్లో తాండవమాడతాయి.గుర్రెరో ప్రాంతంలోని నలువా గ్రామంతోపాటు, లా ఎస్పెరాంజో, ఎల్ రాంచో లాస్ లొమాస్ గ్రామాల మహిళలైతే ఒకరినొకరు రక్తం కారేలా తన్నుకుంటూ వరుణుడిని శాంతింపజేస్తున్నామని నొప్పిని భరిస్తారు.

**స్నేహంగానే అంటూ..**

ప్రతి ఏటా మే ఆరంభంలో ఈ విధంగానే వర్షానికి స్వాగతం పలుకుతారు. తొలి రోజు ఇరు గ్రామాల మహిళలంతా ఉదయాన్నే లేచి పెద్ద మొత్తంలో పిండి వంటల్ని తయారుచేస్తారు. టర్కీ, చికెన్, అన్నం, గుడ్లు వంటి వాటితో బలవర్ధకమైన ఆహారం చేస్తారు. అంతటితో అలసిపోకుండా వాటిని గ్రామ సరిహద్దుల్లోకి మోసుకొస్తారు. రకరకాల పూలతో అలంకరించి భూమికి, పైనున్న ఆకాశానికి, వారి దేవుడు టియాలోక్‌కి సంతర్పణ చేస్తారు. ఈ లోగా ఇరుగ్రామాల ప్రజలు అభిమానంగా పలకరించుకుని ఓ సర్కిల్‌గా నించుంటారు. వారిలో ముష్టిఘాతాల్లో ఆరితేరిన మహిళలు బయటకు వచ్చి వారి దేవుడు టియాలోక్‌తో పాటు, కన్య మేరీ మాతను ప్రార్థిస్తారు. తర్వాత యువతులను గొడవకు దిగాల్సిందిగా రెచ్చగొడతారు. పోటీదారులు పోగుబడ్డాక పిడిగుద్దులకు దిగుతారు. ఇక్కడ ఎవరు గెలిచారనేది పాయింట్ కాదన్నయ్యా.. రక్తం కారిందా లేదా అనేదే విషయమన్నట్టు ఒళ్లంతా కుళ్లబొడుచుకుంటారు. అప్పుడప్పుడు మాబ్ హిస్టీరియాకు లోనైన పురుషులు కూడా తలో చేయి వేస్తారు. వారిని చూసి పిల్లలూ రంగంలోకి దూకుతారు. ఇలా చీకటి పడేంత వరకు రక్తంతో ఆ ప్రాంతానికి వెల్ల వేస్తారు. కార్యక్రమం పూర్తయ్యాక ఇంతకు ముందు ఏం జరగనట్టు కౌగిలించుకుని ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకుంటారు. గాయాలై సొమ్మసిల్లిన మహిళల్ని వారి పురుషులు జాగ్రత్తగా ఇళ్లకు చేరవేస్తారు.

**మహిళలకు మాత్రమే..**

కారిన రక్తాన్ని బకెట్లతో నింపి పొలాల్ని తడుపుతారు. కేవలం మహిళలే ఎందుకంటే వ్యవసాయ పనులు చేయాలిగా అంటారు. దేవుడి కోసమే తన్నులు తింటే, దెబ్బలు మానిపోవా ఏమిటి? అని వారినెవరూ ప్రశ్నించలేదనుకుంటా. తన్నులు తినే భాగ్యాన్ని మహిళలకే పరిమితం చేశారు. అయితే, ఈ రక్త తర్పణానికి వారో కథ చెబుతారు. ఒకప్పుడు ఆ ప్రాంత ప్రజలు మూడు వర్గాలుగా చీలిపోయి నిరంతరం గొడవలాడుకుంటూ ఉండేవారట. అది వారి వరుణ దేవుడు టియాలోక్‌కి ఆగ్రహం తెప్పించి వర్షం కురిపించడం ఆపేశాడట. అందుకే వారు పగలని మరచి స్నేహపూర్వకంగా దెబ్బలాడుకుంటున్నారట. ఇంకో కథేంటంటే అక్కడి దగ్గరలోని కొండపై నీరు పోగుబడి పోయిందట. దాన్ని తెచ్చే మార్గంలో ఇరు గ్రామాలకు చెందిన సాహసులు యుద్ధం చేసుకుంటూ వారి గ్రామాలకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారట. ఇద్దరు.. అంత నీటిని.. చేతిలో దాచుకుని.. గ్రామాలకు విజయవంతంగా తెచ్చారట. దానికి గుర్తుగానే ఈ ఆచారం ఇంకా కొనసాగిస్తున్నారు. కేథలిక్, ప్రీ హిస్పానిక్ సంప్రదాయాల్ని మిళితం చేసుకుని వారు అనుసరిస్తారు. ఈ మహాగొప్ప ఆచారం అజ్‌టెక్‌ల కాలానికి చెందినదని భావిస్తున్నారు చరిత్రకారులు. మొక్కజొన్న పంటకు ముందు వారలాంటి పద్ధతుల్ని పాటించేవారు.

ఇలాంటిదే పెరూలోనూ చుంబివిల్కాస్ అనే ప్రాంతంలో టకనాకుయ్ ఆచారం పేరిట నిర్వహిస్తున్నారు. అయితే పురుషులిక్కడ పెద్ద మనసు చేసుకుని మహిళల్ని పక్కన పెట్టారులెండి. మెక్సికోలోనే జిటాలా, చిలెపా, ఆకట్లాన్ పట్టణాల్లో కూడా ఇలాంటి భయంకరమైన ఆచారాలు ఉన్నాయి. పులి వేషాలు వేసుకుని నృత్యాలు చేస్తూ కొరడా దెబ్బలతో శరీరం రక్తం కారేలా కొట్టుకుంటూ వర్షం కోసం ప్రార్థనలు చేస్తారు. వర్షం మాట అటుంచితే ఆ విధంగా నష్టపోయే రక్తాన్నేదో దానంగా చేస్తే చాలా మంది ప్రాణాల్ని నిలబెట్టిన వాళ్లవుతారని స్వచ్ఛంద సంస్థల మాట. ఎవరికో దానం చేయడం సంగతి అలా వుంచితే... ఈ ఆచారాల్లో చావుదెబ్బలు తిన్నవారికే తిరిగి రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి కూడా ఉంది. మూఢనమ్మకాలకు పోయి ప్రాణాల మీదకు తెచ్చుకోవడమంటే ఇదే!

✦

# నవ్వుల్ – పువ్వుల్

## వృత్తి ధర్మం

**ఒ**క వ్యక్తి లైబ్రరీకి వెళ్ళి ఆత్మహత్య చేసుకోవడం గురించిన పుస్తకాన్ని అడుగుతాడు

**ఆ** లైబ్రేరియన్ ఎగా దిగా చూసి ఇలా అంటాడు

**త**మ్ముడూ బుక్ ఎవరు రిటర్న్ చేస్తారు?

## చలి

**రాము:** ఒరేయ్ జంభూ అంత చలిగా ఉంటే స్విమ్మింగ్ పూల్‌లో ఎలా స్నానం చేస్తున్నావ్‌రా?

**సోము**: అందుకేగా స్వెట్టర్ వేసుకొని చేస్తున్నాను.

## టూ వీలర్

**న**లుగురు కుర్రాళ్ళు ఒక మోటారు సైకిల్ మీద పార్టీకి బయలు దేరుతారు. ట్రాఫిక్ పోలీస్ వాళ్ళని ఆపుతాడు.

**టూ**వీలర్ మీద ముగ్గురు రావడమే నేరం అటువంటిది మీరు నలుగురు వస్తున్నారు. పదండి స్టేషనికి అంటాడు ట్రాఫిక్ పోలీస్.

**మో**టారు సైకిల్ నడుపుతున్న కుర్రాడు హఠాత్తుగా వెనక్కు చూసి వార్నీ ఐదో వాడెక్కడ పడిపోయాడ్రా. ఇవ్వాళ పార్టీకి బిల్ కట్టాల్సింది వాడే కదా అంటాడు.

## తొక్క

**ఎం**తోయ్ ఒక్కో అరటిపండు అడిగాడు శివకోటి పండ్లు అమ్మే కుర్రాడిని

**"ఒ**క్కోటి రూపాయి సార్"

చెప్పాడతను.

"ముప్పావలాకిస్తావా;"

**ము**ప్పావలాకు తొక్క వస్తుంది

**" స**రే అయితే ఈ పావలా తీసుకుని తొక్క నువ్వుంచుకుని పండు నాకివ్వు " అన్నాడు శివకోటి.



## లేడీస్ ఫస్ట్

**టీచర్**: ఈ వాక్యం సరిచేయి "ఎద్దూ, ఆవు పరస్పరం తోసుకుంటున్నాయి

**గిరిష్:** ఆవు, ఎద్దూ పరస్పరం తోసులాడుకుంటున్నాయి

**టీచర్:** దీంట్లో నువ్వు చేసిన మార్పు ఏమిటి?

**గిరిష్:** లేడీస్ ఫస్ట్

## ఏ కాలం

పిల్లల నుండి సమాధానాలు రాబట్టాలనుకున్నారు మాష్టారు.

**మాష్టారు:** సూర్యుడు పడమట అస్తమించాడు. రాహుల్ ఇదేం కాలం చెప్పు?

**రాహుల్:** సాయంకాలం సార్

**మాష్టారు**: అది కాదు బాబు బాగా ఆలోచించి చెప్పు

**రాహుల్:** మరో ప్రశ్న అడగండి సార్

**మాష్టారు:** శ్రీకృష్ణుడు కంసుడ్ని సంహరించెను. ఇదేం కాలం

**రాహుల్:** వాడికి పోయే కాలం సార్

## వేలం

**బ**స్సు వెళ్తోంది హఠాత్తుగా కనకారావు కేకపెట్టాడు.

**"బా**బూ నా పర్సు పోయింది. దాన్లో పదివేల రూపాయ లున్నాయి.

**నా** పర్సు నాకిస్తే వారికి వంద రూపాయలిస్తాను" ఏడుస్తూ అన్నాడు.

**"నా**కిస్తే ఐదొందలిస్తాను" మరో వ్యక్తి అరిచాడు

**"నా**కిస్తే వెయ్యి"

**"నా**కిస్తే రెండు వేలు"

**అ**సలెవ్వరికి ఇవ్వకుంటే మొత్తం నావేగా అన్నాడొక ప్రయాణీకుడు నాలుక కరుచుకుంటూ.

# నలుపు & తెలుపు

నలుపు తెలుపుల్లో అందం పాత సినిమాల్లో ఇట్టే తెలుస్తుంది. గోడకు తగిలించిన తాతల ఫొటోలు నలుపు తెలుపుల్లో ఏదో తెలీని గాంభీర్యం ఉట్టిపడుతుంటుంది. ఆఖరకు మన మదిలోని భావాల్ని డైరీల్లోకి తర్జుమా చేసేటపుడు కూడా తెల్లటి కాగితంపై నల్లటి సిరా జోడీతోనే అందంగా అక్షరాల పూలను వికసిస్తాయి. ఈ తెలుపు నలుపుల్లోని కాంట్రాస్టే ఏ వస్తువుకైనా చాలా ఇంట్రెస్ట్ తెచ్చిపెడుతుంది. ఈ బ్లాక్ అండ్ వైట్‌లోని విశేషాలు కొన్ని.

తెల్లటి హంసలంటే చాలామందికి ఇష్టం. ఆస్ట్రేలియాలో నల్లటి హంసలు కూడా ఉన్నాయి.

39123439

వస్తువుల వివరాలు చెప్పే బార్ కోడ్ కూడా నలుపు తెలుపు గీతలతోనే ఉంటుంది.

కరాటేలోని బ్లాక్ బెల్ట్ సాధిస్తే బాగా ఆరితేరిన వారి కింద లెక్క. అదే వైట్ బెల్ట్ పెట్టుకుని కనిపిస్తే అప్పుడే నేర్చుకుం టున్న విద్యార్థి అని తెలుస్తుంది.

ఐక్యరాజ్య సమితికి చెందిన వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్) తమ లోగో నలుపు తెలుపుల్లో ఆకట్టుకునే పాండానే. పాండా చెవులు, కాళ్లు, వీపు పైభాగం, కళ్ల చుట్టు నల్లగా ఉంటే మిగతా శరీర భాగం తెల్లగా ఉంటుంది.

బ్లాక్ అండ్ వైట్ సినిమాల రోజులు పోయాయని బాధ పడుతున్న వారికి ఊరటగా రంగుల సినీ యుగంలో అప్పుడప్పుడు నలుపు తెలుపు చిత్రాలు తళుక్కుమంటున్నాయి. సిండ్లర్స్ లిస్ట్, మాన్‌హట్టన్, రేజింగ్ బుల్ లాంటి హాలీవుడ్ సినిమాలు ఇలాంటివే. 'మొఘల్ ఈ ఆజం' లాంటి క్లాసిక్స్‌ను రంగుల్లోకి మార్చిన ఆ సినిమాలు నలుపు తెలుపుల్లోనే అజరామరంగా కనిపిస్తాయి.

కారు రేసులు, బైక్ రేసుల్లాంటి మోటార్ పందేల్లో కనిపించే బ్లాక్ అండ్ వైట్ చెకర్డ్ ఫ్లాగ్ రేసు ముగింపును సూచిస్తుంది.

జీబ్రా లైన్లు నల్లటి తారు రోడ్డు మీద తెల్లటి చారలతో దూరం నుంచి కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి.

పాశ్చాత్యానికి తెలుపు శుభసూచికం. పెళ్లిళ్లలోను వధువులు శ్వేత వర్ణ దుస్తుల్లో దేవకన్యల్లా కనిపిస్తారు. అదే చాలా ఆసియా దేశాల్లో తెలుపును విషాద సందర్భాల్లో వాడతారు. పాశ్చాత్యానికి నలుపు అలాంటిది.

ఇక పియానో, హార్మోనియం లాంటి వాద్య పరికరాలు బ్లాక్ అండ్ వైట్ మెట్ల వరసలతోనే ఉంటాయి.

డాల్మేషన్ జాతి కుక్క శరీరం రంగు తెల్లగా ఉంటే వాటి మీద నల్లటి మచ్చలు ఒంటాయి. వీటిపై ప్రత్యేకంగా '101 డాల్మేషన్స్' చిత్రం కూడా విడుదలై మెగా హిట్‌గా నిలిచింది.



చదరంగంలోని పావులతో పాటు వాటి గళ్లు కూడా నలుపు తెలుపుల్లోనే ఎక్కువగా వాడతారు.

"మీర జాలగలడా నా ఆనతి.. వ్రత విధాన మహిమన్ సత్యావతి.." అంటూ ఒక చేత వాలుజడ పట్టుకుని మరో చెయ్యి నడుం మీద గర్వంగా వేస్తూ.. చురకత్తి లాంటి చూపులతో ఆగ్రహావేశాన్ని అందంగా ప్రదర్శించిన ఆ సమ్మోహన రూపం ఎవరికుంటుంది! ఒక్క జమునకు తప్ప.

# ఆమెకు ఆమే సాటి

జమున కర్నాటకలోని హంపిలో పుట్టినా.. పెరిగింది మాత్రం గుంటూరు జిల్లా దుగ్గిరాలలోనే. శ్రీనివాసరావు, కౌశల్యాదేవి దంపతుల ముద్దుల కూతురు జమున.

తనకున్న సంగీత ప్రవేశంతో జమునకి చిన్నతనంలోనే సంగీతం నేర్పించింది కౌశల్య. హార్మోనియం వాయిస్తూ హావభావాలు ప్రదర్శిస్తూ చిన్నతనంలోనే శృతి శ్రద్ధగా పాడటం చూసి తల్లిదండ్రులు మురిసిపోయే వారు. స్కూల్లో ఏ సాంస్కృతిక కార్యక్రమాలు చేసినా జమున ముందుండేది. ఆ విభాగం నిర్వహించే టీచర్లు ముచ్చటపడేవారు. అదే సమయంలో మహానటి సావిత్రి కూడా సత్యనారాయణపురం (విజయవాడ)లో వుంటూ మద్దాల సుశీలతో కలిసి సంగీత నృత్యప్రదర్శన ఇస్తూ ఉండేది. దుగ్గిరాలలో ఓ నృత్య ప్రదర్శన ఇస్తుండగా వారికి జమున తండ్రి తన ఇంట్లోనే విడిది ఏర్పాటు చేశాడు. రంగస్థలం మీద సావిత్రి ప్రదర్శన ఇస్తుండగా.. తన ప్రదర్శనకి అనుగుణంగా జమున హాస్య ప్రదర్శనలు చూసి మురిసిపోయింది సావిత్రి. "నువ్వు సినిమాల్లో చేరితే బ్రహ్మాండంగా రాణిస్తావు చెల్లీ!" అంది. చెల్లీ అనే మాటను కొన ఊపిరి వున్నంత వరకు ఇద్దరూ నిలబెట్టుకున్నారు. సావిత్రి జమునల మధ్య అక్కా చెల్లెళ్ళ బంధం కొనసాగింది. జమున పెళ్ళిని సావిత్రి దగ్గరుండి జరిపించింది. ఇదే వారి అనుబంధానికి తార్కాణం.

ఆ రోజుల్లో గరికపాటి రాజారావు గొప్ప నాటక ప్రయోక్త. ఔత్సాహిక కళాకారుల్ని ప్రోత్సహించేవారు. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోషియేషన్ ఏర్పాటు చేసి మంచి నటన ప్రదర్శించేవారిని ఎంపిక చేసేవారు. అలా "మాభూమి" ప్రదర్శన ఇస్తున్నప్పుడు జమున స్టేజీ ఫియర్ అస్సలు లేకుండా చకచక కళ్ళు తిప్పుతూ.. అలవోకగా నవరసాలు పలికిస్తూ.. ప్రేక్షకుల హర్షధ్వానాల్ని సొంతం చేసుకున్న పన్నెండేళ్ళ జమున రాజారావు గార్ని కట్టిపడేసింది. సినిమాలో నటిస్తావా? అని అడిగాడు ఆయన. ఓ.... అంది జమున. తండ్రి శ్రీనివాసరావుకి అస్సలు ఇష్టంలేదు. తల్లి కౌశల్యాదేవికి మాత్రం ఇష్టమే. అది బైటికి చెప్పే ధైర్యం లేదు. చివరికి తనకు దుగ్గిరాలలో పాఠాలు చెప్పిన జగ్గయ్య ప్రోద్బలంతో జమున సినీరంగ ప్రవేశం జరిగిపోయింది.

తన పద్నాలుగవ ఏట జమున "పుట్టిల్లు" చిత్రంలో నటించింది. అప్పటికే భానుమతి, అంజలి, సావిత్రి, యస్.వరలక్ష్మి కథానాయికలుగా రాణిస్తున్నారు. వారి మధ్య జమున నెగ్గుకురాగలదా? అని అందరూ భయపడ్డారు. అదే సమయంలో వాహిని సంస్థ "బంగారు పాప" చిత్రాన్ని నిర్మిస్తుంది. ఈ చిత్రానికి పనిచేయడానికి ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు చెన్నై వచ్చారు. జగ్గయ్య సరసన జమున నటించింది. ఈ చిత్రం ఇప్పటికీ క్లాసిక్‌గా నిలిచిపోయింది. విక్టరీ మధుసూదనరావు దర్శకత్వంలో జగపతి సంస్థ అధినేత వి.బి. రాజేంద్రప్రసాద్ రావు గారి తొలి చిత్రం 'అన్నపూర్ణ'లో నటించింది. వి.బి. రాజేంద్రప్రసాద్‌ను ఏస్ నిర్మాతగా నిలబెట్టింది ఆ చిత్రం.

వామపక్ష భావాలతో చిత్ర నిర్మాణం మొదలుపెట్టిన కె.బి.తిలక్ అనుపమ సంస్థను స్థాపించి మొట్టమొదటిసారిగా "ముద్దుబిడ్డ" అనే చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం సంచలనం సృష్టించింది. పెండ్యాల స్వరపరిచిన పాటలు ఇప్పటికీ మరిచిపోలేని ప్రేక్షకులు వున్నారు. 'చూడాలని వుంది.. అమ్మా చూడాలని వుంది.. పొరపాటు పనులిక చేయబోనని నీతో చెప్పాలి!' అంటూ సుశీల వెక్కివెక్కి ఏడుస్తూ.. పాడిన పాట విని విలవిల్లాడిపోయిన తల్లులెందరో. ఈ చిత్రంలోనూ కథానాయకుడు జగ్గయ్యే. పొన్నలూరి

అక్కినేనితో....

బ్రదర్స్, బి.యన్. రెడ్డి దర్శకత్వంలో 'భాగ్యరేఖ' చిత్రం నిర్మించింది. ఈ చిత్రంలో జమున పాటగా సుశీల పాడిన 'నీవుండేదా కొండపై నా స్వామి నేనుండేదీ నేలపై ఏ వేళ సేవింతునో ఓ స్వామి..' అంటూ సాగిన ఈ పాటకి జమున జీవం పోసింది. ఈ పాటతో జమున మహిళలందరికీ చేరువయ్యింది. జమున చిన్న వయసులోనే అగ్రకథానాయకుడు యన్.టి.రామారావుతో 'చిరంజీవులు' చిత్రంలో నటించింది. వేదాంతం రాఘవయ్య దర్శకుడు. యన్.టి.ఆర్., జమున పోటీపడి నటించారు.

**గీతా లత**

'కనుపాప కరువైన కనులెందుకో.. తనవారు పరులైన బ్రతుకెందుకో..' పాట మరిచిపోగలమా! ఈ సినిమాతో జమున క్లాస్‌తో పాటు మాస్‌కి కూడా దగ్గరయ్యింది. తెలుగు ప్రేక్షకులు జమునని సొంతం చేసుకున్నారు. యల్వీప్రసాద్ దర్శకత్వంలో 'మిస్సమ్మ' చిత్రంలో అక్కినేని సరసన హుషారైన పాత్రల్లో పోటీపడి నటించింది. అలాగే అక్కినేని కాంబినేషన్ "ఇల్లరికం" చిత్రంలో 'నిలువవే వాలు కనులదానా.. వయ్యారి హంస నడకదానా..' పాట ఆంధ్రదేశమంతా మార్మోగిపోయింది. జమున అందానికి ముగ్ధులైపోయారు. సి.యన్.రావు దర్శకత్వంలో 'కీలు బొమ్మలు', ఆదుర్తి దర్శకత్వంలో 'తోడు నీడ' మరిచిపోలేని చిత్రాలు. అంతకుముందు దర్శకుడు కె.వి.రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'పెళ్ళినాటి ప్రమాణాలు', అక్కినేని సరసన రొమాంటిక్ పాత్రలో నూటికి నూరు మార్కులు సంపాదించింది. 'వెన్నెలలోనే వేడియేలనో.. వేడిమిలోనే చలువ యేలనో.. ఈ మాయ ఏమో జాబిలీ..' ఆ రోజుల్లో యువతరాన్ని ఈ పాట ఊపేసింది.

**నటన వైవిధ్యభరితం**

జమున స్వతహాగా పాటలు పాడగలదు. సంగీతంలో ప్రవేశముంది గనుక పద్యాలు పాడగలదు. 'శ్రీకృష్ణ తులాభారం' చిత్రంలో సత్యభామ పాత్ర మచ్చుతునక. 'మీర జాలగలడా..' అని హూంకరిస్తూ కృష్ణుడిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసే సత్య పాత్రను కళ్లకు కట్టింది. డబ్బున్న అమ్మాయి, పొగరుబోతు అమ్మాయి, అహంకారి అమ్మాయి పాత్రలకు జమున అచ్చుగుద్దినట్టు సరిపోతుందని అనుకుంటారు. కానీ, 'మూగమనసులు' చిత్రంలో అమాయకమైన పాత్ర ఎంత గొప్పగా చేసిందని.. ఆ రోజుల్లో జమునని అనుసరించిన అభిమానులు కోకొల్లలు. నాటి 'భూకైలాస్' చిత్రం నుంచి బాపుగారి 'సీతాకళ్యాణం' చిత్రం వరకు ఆమె నటించిన పాత్రలు అనితర సాధ్యం. కలెక్టర్ జానకి, పండంటి కాపురం, బంగారుతల్లి, లేత మనసులు, మూగనోములు, సంగీత లక్ష్మి, రాము, తోడు నీడ, తహసీల్దారు గారమ్మాయి, చదరంగం ఇలా ఎన్నో చిత్రాలు. పౌరాణిక చిత్రాలైనా, జానపద చిత్రాలైనా, సాంఘిక చిత్రాలైనా జమున అద్భుతంగా నటించేది. బంగారు తల్లి చిత్రంలో నేషనల్ అవార్డు మిస్సయ్యింది. జమున కెరీర్ ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న తరుణంలో అగ్రనటులతో నటించే అవకాశాలు తగ్గాయి. కారణాలు తెలీవు. ఆ సమయంలో వరుసగా జగ్గయ్యతో చిత్రాలు చేసింది. మళ్ళీ 'గుండమ్మ కథ', 'గులేబకావళి' చిత్రాలతో అక్కినేని, యన్.టి.ఆర్‌ల సరసన నటించింది. వీరి మధ్య దూరం తగ్గిపోయింది. ఏసీ త్రిలోక్ చందర్ దర్శకత్వంలో వచ్చిన 'నాదీ ఆడజన్మే!' చిత్రంలో జమున హరనాథ్ సరసన నటించింది. ఈ జంటను సూపర్ హిట్ జంటగా ప్రేక్షకులు దీవించారు. తర్వాత 'లేతమనసులు' చిత్రంలో జమున, హరనాథ్‌లు అలరించారు. ఆ చిత్రంలో నటిస్తుండగా (జయశంకర్) తలకు తగిలిన గాయం ఆమె జీవితంలో ఎదురుదెబ్బ.

**వ్యక్తిగత జీవితం**

1965లో తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో పనిచేస్తున్న ప్రొఫెసరు రామారావుని జమున పెళ్ళాడింది. విద్యాధికుడైన వ్యక్తిని స్థాయి భేదం లేకుండా పెళ్ళిచేసుకోవాలనుకుంది. మహనటి సావిత్రి ప్రోద్భలంతో పెళ్ళి చేసుకుంది. వీరికిద్దరు చిన్నారులు స్రవంతి, వంశీ. వంశీ అమెరికాలో వుంటున్నాడు. ఆ రోజుల్లో రాజమండ్రి ఎంపీగా గెలుపొంది లోక్‌సభలో ప్రజావాణిని వినిపించింది. జమున జీవితంలో అతి ముఖ్యమైన విషయం వృత్తి కళాకారులను, నిరుపేద కళాకారులను గుర్తించి వారికి సేవలందించడం. ఆమె పేరిట రాజమండ్రిలో 'జమున కాలనీ' నెలకొల్పింది. ఇప్పటికీ అది కళల సమాహారంగా శోభిల్లడం రేపటి తరాలకు స్ఫూర్తిదాయకం. జమున పౌరాణిక నాటకాలను పండించిన దిట్ట. పౌరాణిక కళాకారులతో వేల ప్రదర్శనలిచ్చి వారి జీవితంలో వెలుగులు నింపారు. వృత్తి కళాకారులందరినీ సాంస్కృతిక శాఖలో పొందుపరిచి వారికి జీవిత కాలం జీవన భృతి వచ్చే విధంగా కృషి చెయ్యడం ఎప్పటికీ గుర్తుండిపోయే విశేషం. ఆ తర్వాత రాజకీయాలు తన ఒంటికి సరిపడవని దూరంగా వుంది.

**అవార్డులు.. రివార్డులు**

జమున జీవితంలో అవార్డుల పంట పండించిన చిత్రంగా 'బంగారు తల్లి' చిత్రాన్ని చెప్పుకోవచ్చు. అదేవిధంగా 'మూగమనసులు' చిత్రంలో గౌరి పాత్ర మరపురానిది. ఆ చిత్రానికి ప్రభుత్వ, స్వచ్ఛంద సేవా సంస్థల అవార్డులు గెలుచుకుంది. జమున జీవితంలో క్లాసిక్స్‌గా నిలిచిపోయే చిత్రాలు చాలా వున్నాయి. బంగారు పాప, చిరంజీవులు, భాగ్యరేఖ, కీలు బొమ్మలు, భూ కైలాస్, ముద్దుబిడ్డ, పెళ్ళి నాటి ప్రమాణాలు ఇలా ఎన్నో చిత్రాలు. ఆమె ఏ రోజు అవార్డుల కోసం వెంపర్లాడలేదు. ఎన్.టి.ఆర్., ఎ.యన్.ఆర్.లతో కలిసి పోటీ పడి నటించిన వ్యక్తి జమున. ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో తనకో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ప్రజానటిగా పేరు సంపాదించి ప్రజా జీవితంలో మమేకమై ప్రజల ప్రేమాభిమానాలను మించిన అవార్డులు ఏముంటాయి అంటుంది. మరొకర్ని ఆమెతో పోల్చడానికి వీల్లేదు. జమునకు సాటి జమునే!

**-ఇమంది రామారావు,**
9010133844

# తేనె తుట్టెల్లో చిత్రాలు



తేనె తుట్టెల్లో ప్రపంచ పటం, ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియాల్ని మీరు చూశారా. ఏదో అనుకోకుండా వాటి ఆకారాలు అలా తయారై ఉండొచ్చని ఊహిస్తే పొరపాటే. రెన్ రీ అనే తేనెటీగల పెంపకందారుడు ఓ టెక్నిక్‌తో ఈ విధంగా తేనే తుట్టెలు రూపొందేలా చేస్తున్నాడు. తేనెటీగల తుట్టె నిర్మాణం రాణి ఈగపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయంతో పాటు మనలా కాకుండా తేనెటీగలు వాటి తుట్టెల నిర్మాణాన్ని పై నుంచి కిందకు చేపడతాయని రెన్ గ్రహించాడు. రాణి ఈగ కదలికల్ని ఆయన నియంత్రిస్తూ ప్రపంచ పటం, ఇతర ఆకారాల స్కెచ్‌లను పొందుపరిచాడు. సరిగ్గా అక్కడ వరకే తేనే తుట్టెల్ని నింపాయి సేకరణ తేనెటీగలు. మొదట్లో వాటి పనికి అవాంతరం కలిగిస్తున్నాడని చాలా సార్లు రెన్‌ను కనీ తీరా కుట్టాయివి. అయినా రెన్ వెనుకడుగు వేయకుండా తాను అనుకున్న విధంగా చిత్రాల్ని అందుకున్నాడు. ఈ ఆర్ట్‌కు యువాన్ సూ అని పేరు పెట్టి తైపీ, షాంఘై, మిలాన్, బీజింగ్, వెనీస్‌ల్లో ప్రదర్శించాడు కూడా. ఇంతకీ యువాన్ సూ అంటే ఏంటంటే ప్రకృతి-మనిషి భాగస్వామ్యం. యాబ్‌స్ట్రాక్ట్ లుక్ వచ్చే యువాన్‌సూ 2ను తుట్టెల్ని రూపొందించడంలో రెన్ ప్రస్తుతం బిజీ అయిపోయాడు.

# బ్యాట్‌మేన్ పిచ్చి

బ్యాంకాక్‌లో ఓ బ్యాట్‌మేన్ పిచ్చి అభిమాని ఉన్నాడు. ఎంత పిచ్చి అంటే ఆ కామిక్ కేరక్టర్ మెమోరాబిలియాతో ఏకంగా ఓ మ్యూజి యాన్నే కట్టేశాడు. సోంచై నిటిమోంగ్కోం ల్చైయే అతడి పేరు. 43 వయసున్న ఈ పెద్ద మనిషి డబ్బంతా బ్యాట్‌మేన్ బొమ్మలకే ఖర్చుచేసేస్తున్నాడు. ఇప్పటి వరకు 50 వేల వివిధ రకాల బొమ్మల్ని సేకరించాడు. బ్యాంకాక్‌లో ఎక్కడ బ్యాట్‌మేన్ బొమ్మ అమ్మకానికి కనిపించినా అక్కడ వాలిపోతాడు. ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీని నడుపుతున్న సోంచై తన సేకరణను ఓ బ్యాట్‌మేన్ పిగ్గీ బ్యాంక్‌తో మొదలెట్టాడు. ఈ-బే, గ్యారేజీ అమ్మకాల ద్వారా పదేళ్లుగా ఆ వస్తువుల్ని కొంటూనే ఉన్నాడు. 2005 నుంచి మొదలైన ఈ సేకరణతో తన ఇల్లు సరిపోవక 2012లో ఓ షాప్‌ను అద్దెకు తీసుకుని మ్యూజియంలా మార్చాడు. ఈ సేకరణలో ప్రత్యేకమైంది ఏమిటంటే లెగో బ్రిక్స్‌తో నిర్మించిన పెద్ద గోతమ్ సిటీ. సినిమాలోలానే ఇందులోను లాబొరేటరీలు, జైళ్లు, గబ్బిలాల గుహ నిర్మించాడు. బ్యాట్‌మేన్ వాడే ప్రత్యేకమైన బ్యాట్‌మొబైల్, బైక్, చివరకు హెలికాప్టర్ లెగోస్‌తో ఉన్నాయి. ఇంత పిచ్చి ఎందుకంటే మిగతా సూపర్ హీరోల కన్నా బ్యాట్‌మేన్ కేరెక్టర్ చాలా ప్రాక్టికల్‌గా ఉంటుందని అంటు న్నాడు. కేవలం బ్యాట్‌మేన్ మాత్రమే కాదండోయ్! మిగతా సూపర్ హీరోల బొమ్మల్ని, కార్టూన్ కేరెక్టర్లను కూడా సేకరిం చాడు. బ్యాట్‌మేన్‌తో పోల్చితే వాటిది చాలా తక్కువ సంఖ్యేలెండి.

వింత లోకం

# స్నిఫ్ఫర్ ఎలుకలు

ల్యాండ్‌మైన్ల సమస్యకు చక్కని పరిష్కారం కనుగొంది అపోపో అనే బెల్జియం స్వచ్ఛంద సంస్థ. మందు పాతరల్ని వాసన చూసి గుర్తు పట్టేలా వర్మిన్ జాతి ఎలుకలకు శిక్షణనిస్తున్నారు. మొజాంబిక్ కల్లోలిత ప్రాంతంలోని 13 వేల ల్యాండ్ మైన్ల ఏరివేతలో వాటిని ఉపయోగిస్తున్నారు. కోటి పది లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న ఈ ల్యాండ్‌మైన్లు ఎంతోమంది ప్రాణాల్ని పొట్టనబెట్టుకున్నాయి. టీబీ నిర్ధారణకు కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. ఇప్పటిదాకా రెండున్నర లక్షల రక్త నమూనాల్ని పరిశీలించాయవి. అపోపోను స్థాపించిన బార్ట్ వీట్జెన్స్ యాంట్వెర్ప్ విశ్వవిద్యాలయంలో చదువుతుండగా రోడెంట్లను పెంచేవాడు. అప్పట్లో వచ్చిన ఓ వార్తలో మూషికాల్లోని ఓ జాతి మందు పాతరల్ని గుర్తించగలవని వచ్చింది. దానిపై పరిశోధన చేసి ఆఫ్రికన్ పౌచ్డ్ ఎలుకలైతే ఈ పని తప్పుల్లేకుండా చేయగలవని గుర్తించాడు. మనుషులు, శునకాలతో పోల్చితే వీటికి అతి తక్కువ ఖర్చుతో శిక్షణనివ్వవచ్చని భద్రతా దళాలకు వివరించాడు. మనుషుల కన్నా వేగంగా ఇవి పనిచేయగలవని, భద్రత సిబ్బంది ఒకరు 5 రోజుల్లో చేసే పని ఇవి కేవలం 20 నిమిషాల్లో పూర్తి చేయగలవని నిరూపించాడు. ల్యాండ్‌మైన్‌లు యాక్టివేట్ అవడానికి అవసరమయ్యే బరువుకు కేజీ తక్కువగానే ఇవి ఉండటంతో పని ప్రాణ నష్టం లేకుండా సాగిపోతోంది. ఇప్పటి వరకు ల్యాండ్‌మైన్ ప్రమాదాల్లో ఒక్క ఎలుకా చనిపోలేదు. ఎలుకల ఎంపిక, శిక్షణ అనేక స్థాయిల్లో జరుగుతుంది. ఎక్కడ తేడా వచ్చినా వాటిని వేరే అవసరాలకు ఉపయోగిస్తారు. ముఖ్యంగా, టీబీ వ్యాధి నిర్ధారణలో అవి మంచి ఫలితాల్ని అందిస్తున్నాయి. తొలుత సంప్రదాయ పద్ధతుల్లో పరీక్షించినా టీబీ పాజిటివ్‌గా తేలకుంటే, శిక్షణనిచ్చిన ఎలుకలచే పరీక్షింపజేస్తారు. రెండు ఎలుకలు వ్యాధిని నిర్ధారిస్తే శాంపిళ్లను మళ్లీ ల్యాబ్ పరీక్షలకు పంపి మళ్లీ చెక్ చేస్తారు. ఇప్పటివరకు 7000 ఇలాంటి కేసుల్ని ఎలుకలు నిర్ధారించాయి. 24 వేల ఇన్ఫెక్షన్లను ఇవి నివారించగలిగాయి. కేన్సర్‌లోను ఇవి ఉపయోగపడగలవో లేదోనని పరిశీలిస్తున్నారు.



మనిషిని పోలిన మనిషులు ఏడుగురు ఉంటారనేది ఓ నమ్మకం. వుండొచ్చు. వుండకపోవచ్చు కూడా. నిర్ధారణ అయిన ఉదంతాలైతే లేవు. అయితే... కవలలు కాకుండా, మనకు అస్సలు పరిచయమే లేని, మనలాంటి పోలికలున్నవారు అకస్మాత్తుగా ఎదురుపడితే గిల్లుకుని మరీ చూస్తాం. ఈ అవకాశాన్నే కల్పిస్తామంటున్నాయి సామాజిక మాధ్యమాలు. వాటి ద్వారా కలుసుకున్నవారూ ఉన్నారు.

# ఆ ఏడుగురు...

సద్దాం హుస్సేన్, అతడి కొడుకు ఉదయ్ హుస్సేన్‌లు దాడుల్ని తప్పించుకునేందుకు వారిని పోలిన మనుషుల్ని వాడేవాళ్లని అంటారు. దీనిపై 'డెవిల్స్ డబుల్' అనే హాలీవుడ్ చిత్రం వచ్చింది. హిట్లర్‌కు చాలామంది డబుల్స్ ఉండేవారట. హత్యాయత్నాల్లో వీరే బలైపోయేవారట. మన సినిమాల్లోను ఇలాంటి కథలు ఎన్నో వచ్చినా...అన్నీ హడావుడిగా సృష్టించినవే. వాటి విజయ రహస్యం మనిషి ఆలోచనలోనే ఉంది. తనలాంటి వ్యక్తులను చూడాలని, కలవాలనే ఆశ తప్పకుండా ఉంటుంది. ఎప్పుడైనా ఎదురు పడితే తప్ప ఈ విషయాన్ని అంతగా పట్టించుకోం. కానీ, కొందరు అలా కాదు తమ లాంటి వారిని వెతుకుతూ ఏళ్లకు ఏళ్లు, ఊళ్లకు ఊళ్లు తిరిగారు. ఈ కొత్త మిలీనియం తొలి ఏడాదిని పురస్కరించుకుని 2000 నుంచి కెనడియన్ ఫొటోగ్రాఫర్ ఫ్రాంకోయిస్ బ్రునెల్లి 'ఐయామ్ నాట్ లుక్ అలైక్?' అనే ప్రాజెక్ట్ చేపట్టాడు. తాను అచ్చుగుద్దినట్టు హాలీవుడ్ నటుడు, 'మిస్టర్ బీన్' రోవాన్ అట్కిన్‌సన్‌ను పోలి ఉంటాడనే విషయం ఆయన్ను ఆశ్చర్యపరిచింది. వారిలానే మిగతా వాళ్లు ఒకరిని పోలిన మనుషులు ఒకరిని గుర్తించి వారి ఆల్బమ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ప్రపంచమంతా చుట్టొచ్చి సుమారు 200 మంది పోలిన మనుషుల పోర్ట్రెయిట్‌లు తీసుకుని ఓ ఆల్బమ్ రూపొందించే పనిలో పడ్డాడు. ఇప్పటికే చాలామందిని ఆయన ఆల్బమ్‌లో చేర్చేశాడు. వీరిలో ఓ మహిళ జంట ఇద్దరికీ పెళ్లిళ్లై ఒకే వయసున్న పిల్లలున్నారు. 2011లో బ్రిటన్‌కు చెందిన జర్నలిస్టు సోఫీ రాబెహ్మద్ కూడా ప్రపంచ యాత్ర చేపట్టింది. రెండేళ్ల శ్రమ తర్వాత తన మిత్రునితో కలిసి పనిచేసిన వ్యక్తే అలా ఉండటంతో ఆమె ఆనందం అంతా ఇంతా కాదు. బర్మింగ్‌హామ్‌కు చెందిన లారెన్ హ్యాచర్ అనే మహిళ అచ్చు తనలానే ఉండటంతో మిత్రుని ద్వారా ఆమెను లండన్‌లోని కోవెంట్ గార్డెన్‌లో కలుసుకుంది. ఏబీసీ చానెల్ 'గుడ్ మార్నింగ్ అమెరికా' కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా పనిచేసేవారికి దగ్గరి పోలికలున్న వారు తెలియజేయాల్సిందిగా ఓ తమాషా కార్యక్రమాన్ని రూపొందించింది. లారా స్పెన్సర్ అనే వ్యాఖ్యాతకైతే అచ్చు అదే ఎత్తు, ఆకృతి, హెయిర్ స్టైల్ ఉన్న అమ్మాయి దొరికింది. ఇలియట్, చాంపియన్ అనే వ్యాఖ్యాతలకు కూడా వారి లాంటి వ్యక్తులే ఎదురయ్యారు. మరో వ్యాఖ్యాత రాబర్ట్స్ అయితే తనలాంటి వ్యక్తిని చూసి వెనక్కు గంతేసింది ఆ షోలో. ఆ ఇద్దరూ కూడా నాలుగు నెలల తేడాతో అమెరికాలోనే జన్మించారు. జానీ సాండ్‌గ్రోవ్, మైకేల్ హారిస్‌లు అనే పరిచయంలేని వ్యక్తులు కూడా ఒకేలా ఉండటంతో వారి కామన్ ఫ్రెండ్ నవోమీ వారిని కలిపింది. వారిద్దరూ మంచి మిత్రులైపోయారు. అయితే మైకేల్, నవోమీ పెళ్లి సందర్భంగా సొంత కుటుంబం వాళ్లు కూడా పొరపాటు పడి జానీకు శుభాకాంక్షలు చెప్పారట.

అలాంటి వారికోసం సైతం ఇప్పుడు సోషల్ మీడియాను వేదికగా చేసుకుని చాలా వెబ్‌సైట్లు పుట్టుకొచ్చాయి. వాటిలో బాగా ఆకట్టుకుంటోంది మాత్రం 'ట్విన్ స్ట్రేంజర్స్.కామ్'. ఫేస్‌బుక్‌లో కూడా పేజీని క్రియేట్ చేసి ఒకరిని పోలిన వారిని ఓ వేదిక కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా దానిలో మీ ఫొటోలు ముఖాకృతి వివరాలు నమోదు చేయడమే. ఆ వెబ్‌సైట్ సృష్టికర్త 26 ఏళ్ల నియామ్ జీనీ అనే అమ్మాయికి తనలాంటి వ్యక్తినే చూశానని మిత్రులు అంటుండేవారు. మొదట్లో పట్టించుకోకున్నా అలాంటి వారిని కలుసుకోవాలని ఆలోచన పుట్టింది. వెంటనే మరో ఇద్దరు మిత్రులతో కలిసి ట్విన్ స్ట్రేంజర్స్ వెబ్‌సైట్‌ను తయారుచేసింది. ఫేస్‌బుక్ ద్వారా ప్రచారం కల్పించిన కొన్ని రోజులకే ఆమెను పోలిన వారి నుంచిబోలెడు పోస్టులు అందాయి. ప్రపంచ నలుమూలల్లోని అమెరికా, ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్ చివరకు మనదేశం నుంచీ ఆమెను పోలికలు ఉన్నవారు కనిపించారు. అయితే తనకు జిరాక్స్ తీసినట్టుండే అమ్మాయి మాత్రం పక్క ఊరులోనే ఉందని తెలిసి ఆమె సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి. కారెన్ బ్రానిగన్ అనే 29 ఏళ్ల ఐర్లాండ్ అమ్మాయి డబ్లిన్‌కు దగ్గరలోనే ఉందని తెలిసి ఆమెకు కలిసింది. సరిగ్గా తన పోలికలతో పాటు హావభావాలు కూడా ఒకేలా ఉండటంతో చాలాసేపు అలా అవాక్కై చూస్తుండిపోయిందట. కేరెన్‌కు ఐదుగురు అక్కచెల్లెళ్లు, ఒక సోదరుడు ఉంటే, జీనీకి ఒక సోదరుడు, ఇద్దరు అక్కచెల్లెళ్లున్నారు. వారిలో ఇంకెవరూ కూడా లేనంత దగ్గరగా కేరెన్, జీనీ కవల పిల్లల్లా ఉన్నారని ఆమె పోస్టు చేసింది. వారివురి ఫొటోలు ఫేస్‌బుక్‌లో అప్‌డేట్ చేస్తోంది. ఇంకో విషయమేమిటంటే వీరిని పోలిన అమ్మాయి ఇటలీలో మరొకరు ఉన్నారట. ఈ మధ్యే వెబ్‌సైట్‌లో ఫొటో పెట్టింది. ఈ లెక్కన జీనీకి తాను అనుకున్న ఆరుగురు దొరికేలానే ఉన్నారు. మీకు కూడా మీ పోలికలున్నవారిని కలవాలని ఉంటే ఆ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు.

ఈ విషయాన్ని శాస్త్రవేత్తలూ నిర్ధారిస్తున్నారు కూడా. మనుషుల్లో ఏ ఇద్దరిని తీసుకున్నా వారి డీఎన్ఏలోని జన్యు నిర్మాణం 99.5 శాతం జతపోలుతుంది. మిగతా 0.5 శాతంలోనే కోటి అరవై లక్షల బేస్ పెయిర్‌లుంటాయి. వీటి నిర్మాణంలోని భిన్నత మూలంగానే శరీర, ముఖాకృతుల్లో తేడాలు వస్తాయి. మనల్ని పోలిన వారితో ఎంత దగ్గరగా ఉంటామో జెనెటిక్ మేకప్ కూడా అంత దగ్గరగా ఉంటుందని బేయ్లర్ కాలేజీ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన జన్యు శాస్త్రవేత్త ఆర్థర్ బ్యూడెట్ చెబుతున్నారు. వెతకాలే కానీ... చైనా, భారత్‌లాంటి భారీ జనాభా ఉన్న దేశాల్లో ఇలాంటి వారు ఎక్కువగా కనిపిస్తారేమో!

# పూవుల్లో దాగున్న లోయ

**సుగంధ భరితం ఆ ప్రయాణం. సువర్ణ మిళితం ఆ లోకం. స్వర్గ లోకపు అంచు ఆ లోయ ప్రాంతం. మంచు తెరల మాటున రోజుకో వర్ణంలో సుమాల అందాల ఆరబోతే 'వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్'. ఉత్తరాఖండ్ నందాదేవి జీవ సంచితలో మలుపు. రంగురంగుల పూలను కప్పుకున్న ఆ పుష్ప లోయల్ని దేవకన్యల ఆట స్థలంగా అభివర్ణిస్తారు స్థానికులు. సుమ గంధాల్లో మునిగి వాటి మృదు స్పర్శల్లో అలసి పోయే ట్రెక్‌లకు ఇదే సరైన సమయం. దేవ కన్యలు విహరిస్తారో లేదో? కానీ, అక్కడకు వెళితే మాత్రం వారి ఆటల్లో పడేస్తుంది పూవుల్లో దాగున్న ఆ లోయ. రోజు రోజుకీ మారే సుమ వర్ణాల ప్రకృతి వైవిధ్య చిత్తరువు.**

ఉత్తరాఖండ్‌లోని ఘర్వాలీ ప్రాంతంలోని చమోలి జిల్లాలోనిదే వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్. అక్కడి జోషిమఠ్‌కు దగ్గరగా భ్యూందర్ లోయ, హేమకుండ్ లోయ, పుష్పవతి లోయల సమాహారమే ఇది. 87.5 చదరపు కిలోమీటర్లలో వ్యాపించిన ఈ లోయ ప్రాంతం దట్టంగా పూలను నింపుకుని పూల లోకంలా అనిపిస్తుంది. 1982లోనే దీన్ని జాతీయ పార్క్‌గా అభివృద్ధి చేశారు. నందాదేవి పార్క్‌కు అభిముఖంగా దానికి పూర్తి వైరుధ్యమైన వాతావారణంలో ఉంటుందీ ప్రాంతం. జంస్కర్, గ్రేటర్ హిమాలయాల చీలికలో ఇది ఉంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూల లోయల్ని కలిగిఉన్న దీన్ని 2005లో యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. జీవ వైవిధ్య ప్రత్యేక బిందువుగా పరిగణించే మిగిలిన ప్రాంతాల్లోని కనిపించని ఇక్కడే ప్రత్యేకంగా పెరిగే పూల జాతులున్నాయి. వాటితో కలిపి 650 రకాల పుష్ప జాతుల్ని గుర్తించారు వృక్ష శాస్త్రవేత్తలు. ప్రొఫెసర్ చంద్ర ప్రకాశ్ కళ నేతృత్వంలోని జట్టే 520 రకాల ఆల్పైన్ మొక్క జాతుల్ని గుర్తించింది. బ్రహ్మ కమలాలు, బ్లూ పాపీలు, నాగుమల్లెలు, ఆర్కిడ్‌లు, డైసీలు, అనిమోన్‌ల వంటి ఎన్నో రకాల పూల వనాలు ఇక్కడ దర్శనమిస్తాయి. వీటితోపాటు 45 రకాల వన మూలికలు కూడా ఇక్కడ గుర్తించారు. చాలా జబ్బులకు స్థానికులు వీటిని ఉపయోగిస్తారు. ఇవి ప్రాచుర్యంలోకి వచ్చింది కూడా వాటి ద్వారానే. అయితే 1983 నుంచి ఇక్కడ నివాసాలను నిషేధించారు. పశువుల మేతను కూడా నిషేధం. అత్యంత సంక్లిష్టమైన వాతావారణం చుట్టుతా ఉన్న ఈ ప్రాంతంలో వృక్ష సంపద మనుగడ చాలా సవాళ్లతో కూడి ఉంది. హిమాలయ ప్రాంత చల్లటి గాలులు, తేమ శాతం తేడాల్ని ఈ లోయలు నిరోధించడం వల్లే గాలిలోని నీటి ఆవిరి బిందువులుగా మారి మొక్కలు తీసుకునేందుకు అనుకూలమైంది. అందుకే ఇక్కడ ఈ పూల సంపద పదిలమైంది. ఈ ప్రత్యేక పరిస్థితులకు ఏ మాత్రం ఆటంకం కలగకుండా చూస్తోంది అటవీ శాఖ. యునెస్కో గుర్తింపు వెనుక ప్రాముఖ్యత కూడా ఇదే. పుష్పవతి నది జలాశయం, గౌరీ పర్వతానికి చెందిన తిప్రా హిమానీ నదం కారణంగా కూడా జీవజలం అందుతోంది. నివాసాల వల్ల ఇది అస్తవ్యస్తం కాకుండా అటవీ శాఖ ఏర్పాట్లు చూస్తోంది. పర్యాటక ప్రాంతంగా ఉన్నా కూడా ఇక్కడ కేవలం ట్రెక్కులనే అనుమతిస్తారు తప్పించి బసకు అవకాశమే ఉండదు. ఆఖరకు హోటళ్లు, రెస్టారెంట్‌లు వంటి ఆహార ఏర్పాట్లు కూడా ఉండవు. ట్రెక్కుకు వెళ్లే ముందే సరిపడినంత ఆహారాన్ని తీసుకెళ్లాల్సి ఉంటుంది. కేవలం మూడు రోజుల పర్మిషన్ మాత్రమే ఉంటుంది. అది కూడా రాత్రుళ్లు వేలీలో తిరగడం నిషిద్ధం. వాహనాల వల్ల కాలుష్య సమస్యలుంటాయనే ముందుచూపుతో రహదారి నిర్మాణం చేపట్టలేదు. దీని దగ్గరలోని

ఆవాస ప్రాంతాల నుంచి ట్రెక్ చేసుకుంటూనే అక్కడికి చేరుకోవాలి. వెళ్లే ప్రదేశం బట్టి 10 నుంచి 17 కి.మీ. ట్రెక్ ఉంటుంది. అంత దూరం నడవలేని వారి కోసం ప్రత్యేకంగా మనుషులే మోసుకెళ్లే డోలీలు ఉంటాయి. పిల్లలు, వృద్ధులు వాటి ద్వారా వేలీలోకి వెళ్లొచ్చు.

**మృదువైన ట్రెక్..**

అసలు ప్రయాణంలోని గొప్పదనమంతా ట్రెక్కింగ్‌లోనే ఉంటుంది. ఉత్తరాఖండ్‌లో తప్పక చేయాల్సిన ట్రెక్కుల్లో ఇది ఒకటి. కష్టంలేకుండానే ట్రెక్ సాగిపోవడం వల్ల దీన్ని వారు బిగినర్స్ ట్రెక్‌గా పిలుస్తారు. జోషిమఠ్ నుంచి గానీ, గోవింద్ ఘాట్ నుంచి గానీ, గంగురియా నుంచి గానీ ట్రెక్ ప్రారంభించొచ్చు. గంగురియా విడిదికి బాగుంటుంది. అక్కడ చాలా హోటళ్లు, లాడ్జిలు బసను కల్పిస్తాయి. గంగురియాలో సిక్కుల గురుద్వార్ చాలా అద్భుతంగా ఉంటుంది. దూరప్రాంతాల నుంచి నడుచుకుంటూ చాలా మంది సిక్కు భక్తులు ఇక్కడకు వస్తూ ఉంటారు. మరో ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ మనకు ఆహ్వానం తెలిపేవి కేవలం మైల్‌స్టోన్‌లు, సైన్‌బోర్డులే కాదు. మత్తెక్కించే సువాసనల్ని వెదజల్లుతూ అడవి గులాబీలు, మల్లెలు వంటివి స్వాగతం చెబుతాయి. రహదారికి ఇరువైపులా అడవి పళ్ల చెట్లు ఉంటాయి. జోషిమఠ్ దగ్గరలోని పట్టణం. అక్కడే శంకరాచార్యుల మఠం ఉంది. బద్రినాథ్ గుడి కూడా దగ్గరే. గోవింద్ ఘాట్ నుంచి అయితే 16 కిలోమీటర్ల ట్రెక్. హరిద్వార్ నుంచి బద్రీనాథ్ వెళ్ళే దారిలో ఇది ఉంటుంది. ఢిల్లీ, హరిద్వార్, బద్రీనాథ్, డెహ్రాడూన్ నుంచి ఇక్కడకు రవాణా మార్గాలున్నాయి. ఢిల్లీ నుంచి 500 కి.మీ. ప్రయాణం. చమోలి, పౌరీ నుంచి కూడా గోవింద్ ఘాట్‌కు చేరుకోవచ్చు. హరిద్వార్ నుంచి 10 గంటల ప్రయాణం. ఋషీకేశ్ నుంచి రైలు మార్గం ఉంది. డెహ్రాడూన్‌లోని జాలీ గోరాంట్ విమానాశ్రయం ఉంది. అక్కడకు వాయు మార్గంలో చేరుకుని గోవింద్ ఘాట్‌కు రోడ్డు మార్గాన వెళ్లొచ్చు.

**ఆగస్టే బెస్ట్**

సెప్టెంబర్ నుంచి మే వరకు ఈ లోయ పూర్తిగా మంచు దుప్పటి చుట్టుకుంటుంది. మొక్కలన్నీ 8 నెలల సుదీర్ఘ శీతనిద్రావస్థలోకి జారుకుంటాయి. ఆ సమయంలో లోయకు వెళ్లే దారులన్నీ మూసుకుపోతాయి. తిరిగి పచ్చదనం సంతరించుకునేది మే నెల చివరి వారంలోనే. అప్పటి నుంచే పర్యాటకులకు అనుమతి దొరుకుతుంది. అయితే, ఈ లోయ పూల అందాల్ని చూడాలంటే మాత్రం జూన్, జూలై, అగస్ట్‌లే సరైన మాసాలు. వైవిధ్యమైన వర్ణాల పూలతో లోయంతా ఏదో ఆబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్‌లా కనిపిస్తుంది. మంచు తెరలు వాటిని చుడుతూ కాంట్రాస్ట్‌ను పెంచి మరింత అద్భుతంగా లోయ చిత్రాన్ని మలుస్తాయి. మంచు పూర్తిగా కరిగి పాల నురుగు లాంటి సెలయేళ్లు, జలపాతాల్ని వీక్షించే అవకాశం ఉంటుంది. అవి ఎంత శ్వేత వర్ణంలో ప్రవహిస్తుంటాయంటే దూరం నుంచి చూసి మంచేమో అని భ్రమ కలుగుతుంది. విస్మయానికి గురిచేసే విషయమేమిటంటే ఇక్కడ రోజుకో విధంగా లోయ వర్ణం, ఆకృతి తోస్తుంది. ఒక్కో వృక్షజాతి మత్తు వదిలించుకుని తిరిగి పూలను విప్పార్చుకుంటాయి. వాటి నిద్ర వదిలే కాలంలోని తేడానే ఈ మహత్తును లోయకు కలిగిస్తుంది. జూలై, అగస్ట్ మాసాల్లోనైతే ఈ వైవిధ్యం, వైరుధ్యం ప్రతి పక్షం రోజులకు మారిపోతుంటుంది. అప్పుడు స్పష్టంగా అబ్బురమైన మార్పును గమనించొచ్చు.

ఈ లోయ విన్యాసాలను చూడాలంటే రతబాన్ శృంగాల సన్నిధికి చేరాల్సిందే. అక్కడి శిఖరం నుంచి చూస్తే దాదాపు 14 కిలోమీటర్ల మేర లోయ అందాల్ని తనివితీరా వీక్షించొచ్చు. ఒక్కసారి అక్కడికి చేరితే తిరిగి వెనక్కురావాలని అనిపించదు. అటవీ అధికారుల కన్నుగప్పి అక్కడే శాశ్వతంగా ఉండిపోవాలనే ఆరాటం కచ్చితంగా మనసును లాగుతుంది.

వేలీ ఆఫ్ ఫ్లవర్స్‌లో కేవలం పూలే కాదు వన్యమృగాలు అబ్బురపరుస్తాయి. అతి అరుదైన మంచు చిరుత ట్రెక్‌లో కనిపించొచ్చు. అక్కడి పర్వత మంటి రంగులో కలిసిపోయే దీన్ని ఉనికిని కనిపెట్టడం చాలా కష్టం. ఎర్ర నక్కలు, నీలి పొట్టేళ్ళ ఎలుగుబంట్లు వంటి వాటిని చూడగలిగే అవకాశం దొరకొచ్చు. ఇవన్నీ అంతరించిపోయే దశలో ఉన్నాయి. పూల మకరందాల్ని సేకరిస్తూ సీతాకోకచిలుకలు తీరికే లేకుండా భ్రమిస్తుంటాయి. వీటికి తోడు ఎన్నో రంగురంగుల పక్షులు వాటి కిలకిలరావాలతో సంగీతాన్ని అందిస్తాయి. మంచు పావురాలు, బంగారు గ్రద్దలు, మంచు కాకులు, భిన్న వర్ణాల పిచ్చుకలు వంటివి ఇక్కడ కనిపిస్తాయి. పరుగులు పెట్టించే బిజీ జీవితాల్లో మానసిక ప్రశాంతతకు, కాంక్రీట్ కీకారణ్యం నుంచి ఎస్కేప్‌కు, కృత్రిమ అందాల నుంచి తప్పించుకునేందుకు వేలీ ఆఫ్ ఫ్లవర్స్ ట్రెక్ చక్కటి మజిలీ. నడక తెలీనివ్వని అందమైన ప్రయాణం. అది మిమ్మల్ని అదృశ్యం చేసేస్తుంది.. ప్రకృతే తోటమాలి పని చేసిన పూల స్వర్గానికి.

**అజయ్ కుమార్ వారాల**

# సినిమా చూపిస్తా మామా..

**తెలుగు వారి జీవితాల్లో సినిమా ఓ అంతర్భాగం. సినీ స్టార్లను ఇలవేల్పులుగా కొలిచే అభిమానులు ప్రతి ఊరిలో కనిపిస్తారు. ఈ సినిమాల్ని ప్రదర్శించే హాళ్లకు సెంటిమెంట్లను ఆపాదించేశారు. మల్టీప్లెక్స్ కల్చర్ వచ్చాక యువత సందడంతా అక్కడే నెలకొని ఉంటోంది. మనకే కాదండోయ్! ప్రపంచవ్యాప్తంగా సినిమా అంటే ప్రత్యేకమైన క్రేజ్. ఆ క్రేజ్‌కు తగ్గట్టు అన్ని సౌకర్యాలను, విలక్షణీయతల్ని ఆపాదించుకుని ముస్తాబైన సినిమా థియేటర్లు ఎన్నో ఉన్నాయి. సినిమా హాళ్లంటే కేవలం తెరలు, సీట్లే కాదు 'అంతకు మించి' ఇంకా ఉంది. రెండు వేల ఏళ్ల నాటి కట్టడాన్ని సినిమా థియేటర్‌గా మార్చేశారు. ఎవరికి వారికే ప్రత్యేక తెరల్ని ఏర్పాటు చేసే థియేటర్లు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. కొన్నింటిలో హాయిగా పడుకుని చూడొచ్చు. కొన్నింటిలో వేడి నీటి టబ్బుల్లో గెంతుతూ పార్టీ చేసుకోవచ్చు. ఇలా ప్రత్యేకంగా సినిమాల్ని ప్రదర్శించే థియేటర్ల గురించి..**

## రోమన్ల తెర

క్రొయేషియాలోని పులాలో ఉన్న యాంపి థియేటర్ ఎరేనా కట్టడం చాలా పురాతనమైంది. పేరుకు తగ్గటుగానే ఇది ఓ పోరాట స్థలంగా కనిపిస్తుంది. పాత కాలం నాటి కట్టడం ఆకృతిలో ఉండే థియేటర్ చూసి చాలామంది ఏవో వినోద కార్యక్రమాలు ప్రదర్శిస్తారని భావిస్తారు. కానీ ఇక్కడ అచ్చంగా సినిమాల్నే ప్రదర్శిస్తారు. భారీ తెర కలిగిన ఈ థియేటర్ చుట్టూ నాలుగు పెద్ద రాతి టవర్లు ఉంటాయి. ఒకప్పుడు ఇది రోమన్ల యుద్ధ కళల్ని ప్రదర్శించే ఎరేనానే. క్రీ.పూ. 27 నుంచి క్రీ.శ. 68 వరకు సాగిన దీని నిర్మాణంలో ప్రస్తుతం సినిమాల్ని ప్రదర్శిస్తున్నారు. క్రొయేషియా కరెన్సీ నోట్లపై కూడా ఈ కట్టడం కనిపిస్తుంది.

## షాక్ ఇస్తుంది

లండన్‌లోని ఎలక్ట్రిక్ సినిమా థియేటర్ చాలా ప్రత్యేకమైంది. షోర్‌డిట్చ్ ప్రావిన్స్‌లో ఉండే ఈ థియేటర్‌లో 50 మంది సినిమాని వీక్షించొచ్చు. ఖరీదైన సీటింగ్‌లో మెత్తటి కాశ్మీరీ దుప్పట్లు కప్పుకుని తీరిగ్గా సినిమాను చూడొచ్చు. దీని ఇంటీరియర్ డిజైనింగ్ అత్యద్భుతంగా ఉంటుంది. ఎర్రని రంగును ఎక్కువగా వాడారు. చాలా విలాసవంతంగా ఉండే ఈ థియేటర్‌లోనికి అడుగుపెడితే దాని సౌందర్యాన్ని చూసి షాక్ అవని వారుండరని అంటారు.

## ఇన్‌స్టిట్యూట్ కూడా..

బుడాపెస్ట్‌లోని 'ది యురానియా' నేషనల్ ఫిల్మ్ థియేటర్ కేవలం సినిమా హాలే కాదు. ఇదో సినిమా ఇన్‌స్టి -ట్యూట్. తాజా చిత్రాలతో పాటు క్లాసిక్స్‌ను ప్రదర్శిస్తారు. ఫిల్మ్ క్లబ్‌లు, నేషనల్, ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తారు. సినిమా కళకు సంబంధించిన సమస్త విషయాలపై కార్యక్రమాల్ని నిర్వహిస్తారు. ప్రత్యేకంగా కనిపించే ఈ కట్టడానికి యూరోపా-నోస్ట్రా అవార్డ్ కూడా వచ్చింది.

## ఎవరి తెరలు వారివే..

పోలాండ్‌లోని పోజ్నాన్ ట్రాన్స్ అట్లాంటిక్ ఫిల్మ్ థియేటర్ సినిమాల్ని ప్రదర్శించడానికే కాదు. ఇక్కడ అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమాజంపై సినిమా, సంగీత ప్రభావాన్ని తెలిపేలా ఇవి ఉంటాయి. సినిమా ప్రదర్శనలే కాక మ్యూజికల్ కాన్సెర్ట్స్‌కు కూడా ఇది వేదిక. ఎవరికి వారికి ప్రత్యేకంగా తెరలను ఏర్పాటు చేస్తారు. ఇక్కడ జరిగే మూవీ ఫెస్టివల్‌కు ప్రపంచ నలుమూలల నుంచి వర్ధమాన కళాకారులతో పాటు దిగ్గజాలు హాజరవుతుంటారు.

## వారసత్వ సంపద

ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ రీజెంట్ థియేటర్ వారసత్వ సంపదగా గుర్తించబడింది. 1920లో హోయ్‌ట్స్ పిక్చర్ ప్యాలెస్‌ల్లో ఒకటైన ఇది ఒకప్పుడు 2000 సీట్ల వరకు ఉండేవి. ఓ రాజ భవనాన్ని తలపించే ఇది స్వర్ణ శోభితంగా ఉంటుంది. గోల్డెన్ హాలీవుడ్ యుగానికి ఉదాహరణగా దీన్ని చూస్తారు. హాలీవుడ్ గోల్డెన్ ఎరాను ఇది పోలి ఉంటుంది.

## సినిమాకు తగ్గట్టు..

'లైఫ్ ఆఫ్ పై' సినిమా చాలా వరకు సముద్రంలోనే నడుస్తుంది. ముఖ్య ఘట్టాలన్నీ పడవలోనే సాగుతాయి. ఇదే ఎఫెక్ట్‌ను ఇస్తూ పారిస్‌లోని 'ది మూవీ థియేటర్' పడవల్లో ఆ సినిమాను చూపించారు. భారీ స్క్రీన్ ముందు కృత్రిమంగా సముద్ర జలాల్ని చేర్చి వాటిలో పడవల్ని పెట్టారు. వాటిల్లోనే కూర్చుని సినిమాను చూడొచ్చు. 3డి ఎఫెక్ట్‌తో సినిమాలోని సన్నివేశాల్ని ప్రత్యక్షంగా చూసినట్టు ఉంటుంది.

## పార్టీ గోయర్లకు..

హాట్ టబ్బుల్లో సేద తీరుతూ సినిమాను చూడాలంటే లండన్ వెళ్లాల్సిందే. రెండు తెరలపై ప్రదర్శనలిచ్చే ఈ థియేటర్‌లో వేడి నీటి టబ్బుల్లో ఆరుగురు చొప్పున సినిమాల్ని వీక్షించొచ్చు. 30 టబ్బులున్న ఈ థియేటర్‌లో ఒక్కో టబ్‌కు ఒక వెయిటర్ ఉంటారు. ఆ టబ్బును ఒకే బృందం బుక్ చేసుకోవాల్సిన అవసరం లేదు. వేరే వారితో దాన్ని పంచుకోవచ్చు. పార్టీ గోయర్లకు అనువుగా ఉంటుంది.

## నిజంగా రత్నమే..

డెట్రాయిట్ క్రౌన్ జ్యుయెల్‌గా గుర్తింపు పొందింది ఫాక్స్ థియేటర్. అద్భుతమైన ఇంటీరియర్ డిజైన్‌తో ఇది చూడముచ్చటగా ఉంటుంది. షేక్స్పియర్ కాలం నాటి నాటక రంగ స్థలాల్ని పోలి ఉండే ఈ థియేటర్‌లో సినిమాల్ని ప్రదర్శిస్తారంటే నమ్మశక్యం కాదు. అదేదో రాజమందిరమనే భ్రమ కలుగుతుంది.

## కొండ కోనల్లో..

డెన్వర్‌లోని 'రెడ్ రాక్స్' యాంపి థియేటర్ ఎర్రని కొండలపై నిర్మించారు. ఈ ఓపెన్ థియేటర్‌లో సినిమా వీక్షణం ప్రత్యేక అనుభూతిని మిగులుస్తుంది. ఓ లైవ్ కాన్సెర్ట్, విదూషకుడి కార్యక్రమం తర్వాత సినిమాను వేస్తారు. గతేడాది సుమారు 65 వేల మంది వీక్షకులు ఇక్కడ ప్రదర్శనల్ని తిలకించారు. ఇక్కడ తొలిసారి ప్రదర్శించిన సినిమా ఆల్ టైమ్ క్లాసిక్‌గా నిలిచిపోయిన ఫ్రాన్సిస్ ఫోర్డ్ కప్పొలా 'ది గాడ్ ఫాదర్'.

## బెడ్‌పై విశ్రాంతిగా..

ఫ్రాన్స్‌లోని ఒలంపియా మ్యూజిక్ హాల్ చాలా అరుదైనది. ఇక్కడ కూర్చుని సినిమాను చూడనక్కర్లేదు. ఏకంగా బెడ్డింగ్‌పై విశ్రాంతి తీసుకుంటూ సినిమా ఆసాంతం చూడొచ్చు. విలాసవంతమైన మంచాలతో పాటు ఆహారం తీసుకునేందుకు ప్రత్యేకంగా టేబుళ్లను ఏర్పాటు చేశారు. పక్కవారితో డిస్టర్బెన్స్ లేకుండా లైటింగ్ ఉంటుంది. బ్రిడ్జ్‌పోర్ట్‌లోని బిజో థియేటర్ అయితే రెస్టారెంట్‌ను తలపిస్తుంది.

## డిస్నీ మరో వండర్

హాలీవుడ్‌లోని సై-ఫై డైన్ ఇన్ డిస్నీ థియేటర్ చిన్న పిల్లల్ని కదలనీయదు. ముచ్చట గొలిపే కారు బొమ్మల మీద కూర్చుని సినిమాను వీక్షించొచ్చు. కేవలం సినీ వినోదానికే కాదు, నోరూరించే చక్కటి భోజనాన్ని చేసేందుకు ఎక్కువగా ప్రేక్షకులు ఈ థియేటర్‌కు వెళతారు. దీన్ని డిస్నీ మరో వండర్‌గా పిలుస్తారు.

అట్టమీది కథ

# ఈ వాతావరణానికి ఏమైంది!

**వానాకాలంలో సరైన వానలు రావు. అలాగని రాకుండా వుండవు. అకాల వర్షాలు కురుస్తాయి. ఒకవేళ సకాలంలోనే వర్షాలు పడ్డా కుంభవృష్టిని చవి చూపిస్తాయి. తుపాన్లు చీటికీ మాటికీ వచ్చి భయపెడుతుంటాయి. వరదల సంగతి సరేసరి. వేసవిలో ఎండలు విపరీతంగా పెరిగి పోతాయి. వడగాల్పుల విషయం చెప్పేదేముంది? పిలవని అతిథుల్లా ఎప్పుడు పడితే అప్పుడు వచ్చి మీద పడుతుంటాయి. ఈ వాతావరణానికి ఏమైంది? ఎందుకిలా మారిపోతోంది ? వాటి ప్రభావం మన మీద, మన ఆరోగ్యం మీద ఎలా వుంటుంది? వంటి అనేక అంశాలు ఈ వారం అట్టమీది కథలో.**

**- డా॥ కాకర్లమూడి విజయ్**

మన దేశంలో మొన్నటి ఏప్రిల్ మాసంలో వేసవి తాపం 50 డిగ్రీల సెల్సియస్‌కి చేరింది. రోడ్లను సైతం కరిగించింది. ఈ 'అసహజమైన' వేసవి వేడి వల్ల దాదాపు 2500 ప్రాణాలు కూడా కరిగిపోయాయి. మన పొరుగునున్న పాకిస్తాన్ లో సైతం వేసవి విజృంభించింది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు అందుకున్నాయి. సుమారు 700 మంది వృద్ధులు ,పేదవాళ్ల ప్రాణాలు హరించాయి. వాయువ్య అమెరికా రాష్ట్రాలలో కూడా ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ కూడా అధికమయ్యింది. అలస్కాలో గ్లేషియర్లు (హిమపాతాలు) కరుగుతున్నాయి. పోయిన నెలలో అక్కడ అరిజోనా కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాంతో వందకు పైగా అడవులలో అగ్ని రాజుకుంది. జపాన్‌లో ఏప్రిల్ మాసంలో సాధారణంగా ఉండే 10 డిగ్రీల ఉష్ణోగ్రత కాస్త ఏకంగా 32 డిగ్రీలకు ఎగిసింది. ఆ వేడికి దాదాపు వెయ్యి మంది ఆసుపత్రులలో చేరారు.

ఒకప్పుడు తుపాన్లు ఎప్పుడో కాని వచ్చేవి కావు. కానీ ఈ మధ్య దాదాపు ప్రతి ఏడాది ఎక్కడో ఒక్క చోట తుపాను బీభత్సాన్ని ప్రజలు చవిచూస్తున్నారు. ఒకప్పుడు వర్షాకాలమంటే ఆ మూడు నెలల్లో వారానికి కనీసం నాలుగు వర్షాలు కురిసేవి. ఇప్పుడు మొత్తం వర్షాకాలమే కాలం చెల్లిన దానిలా మారిపోయింది. ఒకప్పుడు హైదరాబాద్‌లో నడి వేసవి కూడా హాయిగా ఉండేది. చెమట అన్న మాటే లేకుండా. ఇప్పుడు వేసవి కాకపోయినా చెమటే! ఎండలకి మొక్కలు మాత్రమే చచ్చిపోతాయనుకునే కాలం పోయింది. మనుషులే ఎడాపెడా రాలిపోతున్నారు. శీతాకాలంలో స్వెట్టర్ల అవసరం కూడా వచ్చిపడింది. ఆరు రుతువులు... నాలుగు కాలాలు.. అంటూ చదువుకునే పిల్లలకి అవేంటో ఎప్పటి నుండి ఎప్పటివరకూ ఉంటాయో వాస్తవంలో కనిపించడం లేదు.

**కారణం మనమే!**

కాలాలు మారాయి. రుతువులు గతి తప్పాయి. తెలిసో తెలికో అందుకు కారణం మాత్రం మనమే. సూర్యుడి కి భూమికి ఉన్న దూరం వలన మన గ్రహానికి కొన్ని ప్రత్యేకతలు ఏర్పడ్డాయి. నీరు నీరులాగా ఉండగలిగింది. వాతావరణం ఏర్పడింది. జీవి ఆవిర్భవానికి అనుకూల వాయువులు, ఉష్ణోగ్రత కుదిరాయి. ఫలితంగా జీవం భూమిపై అభివృద్ధి చెందగలిగింది. భూమి సూర్యుడి చుట్టూ తిరగడం మూలాన మనకి కాలాలు ఏర్పడ్డాయని చిన్నప్పుడు చదువుకున్నాం. ఇప్పటికీ భూమి తిరగడంలో మార్పు లేదు. కానీ కాలానుగుణ మార్పులే కన్పించడం లేదు.

భూమిపైన ప్రాణం పుట్టుకకు ఆయువు పట్టులాంటి 'వెచ్చదనం' భూమికే ప్రత్యేకం.

ఇతర గ్రహాలపై మాదిరి నీరు ఆవిరైపోయేంత వేడిగానూ నీరు ఘనీభవించేంత చల్లగాను ఉండకపోవడం జీవాల అభివృద్ధికి సానుకూల పరిస్థితి. కానీ ఇప్పుడు ఆ వెచ్చదనం కాస్తా వేడిగా మారుతోంది. ఇందుకు కారణం భూమి సూర్యుడికి దగ్గరగా జరగడం కాదు. అందుకు కారణం మనమే. మనం విడుదల చేసే కార్బన్ డయాక్సైడ్ వాయువే.

**కార్బన్‌డయాక్సైడ్‌తో తిప్పలు**

వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ ఒక పారదర్శక దుప్పటిలా ఉండి, పగలు సూర్యుడి కాంతితో పాటు ఉష్ణాన్ని భూమిపైకి అనుమతిస్తుంది. సూర్యాస్తమయం తరువాత కాంతి పోతుంది. దాంతో పాటే వెళ్ళాలని ప్రయత్నించే వేడిని మాత్రం కార్బన్ డయాక్సైడ్ పొర చాలా వరకు అడ్డుకుంటుంది. ఆ విధంగా భూమిపై వెచ్చదనం నిలిచి ఉంటుంది. ఈ ప్రక్రియను "హరిత గృహ" ప్రభావం అంటున్నాం. మనం అనేక విధాలుగా వాతావరణంలోకి కాలుష్య రూపంలో కార్బన్ డయాక్సైడ్ వాయువుని అధికంగా విడుదల చేస్తున్నాం. ఆ వాయువు గాలిలో ఎంత పేరుకుపోయిందంటే అది మరింత దళసరి దుప్పటిలా మారింది. ఆ కారణంగా భూమిపైకి వచ్చిన వేడి మరింత ఎక్కువగా నిలిచిపోతుంది. భూమిపైన సగటు ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణం అధిక కార్బన్ డయాక్సైడ్ వాయువు. మరి పెరిగిన వేడి పర్యవసానాలు తీవ్రంగానే ఆందోళన కలిగించేలా ఉన్నాయి.

వేడివల్ల క్రమక్రమంగా భూమిపైనున్న మంచు కరుగుతుంది. ఆ కరిగిన మంచు నీరు నదుల్లోనూ, సముద్రాల్లోనూ చేరుతుంది. ఫలితంగా నదులూ సముద్ర మట్టాలు పెరిగి వరదలు, ముంపు జరుగుతాయి. కొన్ని చిన్న ద్వీపాలు నీట మునిగిపోతాయి. వేడికి నీరు ఆవిరైనా అది చల్లబడి మబ్బుతో వర్షంగా మారడానికి అనుకూల పరిస్థితులు రాకపోవచ్చు. అందువల్ల వర్షాభావం కలుగుతుంది. ఆ కారణంగా అరణ్యాలు అంతరించి పోతాయి. జంతుజాలాలు తగ్గిపోతాయి. ఒకప్పటి పొలాలు బీళ్లై ఎడారులుగా మారుతాయి. చివరికి మానవుడి ఉనికి ఈ భూమిపై ప్రశ్నార్థకమౌతుంది.

భవిష్యతు భయంకరంగా కనిపించినా ఇదే మనం రాబోయే తరాలకి అందించేది. తాత్కాలిక సౌలభ్యం సౌకర్యం కోసం మనమే భూగోళ స్వరూపాన్ని సమూలంగా మార్చేస్తున్నాం. మనం అవాసాల కోసం అడవులని నరికేశాం. వాటి గుండా రైలు, రోడ్డు మార్గాలు ఏర్పాటు చేసుకున్నాం. చుట్టూ పరిశ్రమలు పెట్టుకున్నాం. ఈ 'అభివృద్ధి' చెందిన ప్రదేశానికి ప్రజలు వలసలు పెరిగిపోతున్నాయి. వారి నివాసాలు అవసరాల కోసం మరింత స్థలం కావాలి. అందుకోసం కొండలు, గుట్టలూ, కాల్వలు, చెరువులు, పంట పొలాలు చివరికి శ్మశానాలనీ వదలకుండా నిర్మాణాలు జరుగుతున్నాయి.

**కాంక్రీటు కష్టాలు**

కాంక్రీటు... చెట్ల మాదిరిగా వేడిని నిక్షిప్తం చేసుకోకుండా వదిలేస్తుంది. చెట్లే గనక వుంటే అవి పగటి పూట వేడిని తీసుకొని రాత్రి చల్లగా ఉంచేవి. కానీ కాంక్రీటు పగలూ రాత్రీ కూడా వేడిని ఇస్తుంది. అందుకే అసలు సూర్యుడిచ్చే వేడికన్నా కాంక్రీటు నగరాల్లో వేడి ఎక్కువనిపిస్తుంది. ఇక నల్లటి తారు రోడ్లు, సిమెంటు రోడ్లు కూడా అత్యధికంగా వేడిని విడుదల చేస్తూనే ఉంటాయి.

భూమిపైన ఏటా దాదాపు 400 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి అవుతుందని అంచనా. అందులో కొంత భాగాన్ని సముద్రాలు అడవులూ పీల్చుకుంటాయి. మానవుల కారణంగా ఏటా దాదాపు 10 బిలియన్ టన్నుల సి.ఒ.టు వాయువు వాతావరణంలోకి విడుదలౌతోంది. భూమిపైన నిత్యం జరిగే మహా కర్బన చక్రంలో మానవుని పాత్ర చిన్నదే. అయినా పరిణామం మాత్రం పెద్దదే.

అసలు మానవులు వాతావరణంలో ప్రమాదకర మార్పులు సంభవించకుండా ఉండేందుకు ఎంత మేరకు కార్బన్ డయాక్సైడ్ (సి.ఒ.టు)ని విడుదల చేయవచ్చు.? అనే పరిశోధన జరిగింది. ఆశ్చర్యకరంగా ఆ మోతాదులో సగానికి పైగా ఇప్పటికే దాటేశాం. ఈ రకంగానే మనం సి.ఒ.టుని విడుదల చేస్తూ పోతుంటే రెండు మూడు దశాబ్దాలలోనే భూతాపం 2 సెల్సియస్ కన్నా ఎక్కువ పెరిగే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తుంది. అప్పుడు మంచుకొండలు కరగాల్సిన... సముద్ర మట్టాలు పెరగాల్సిన... తప్పనిసరి పరిస్థితి వస్తుంది.

పారిశ్రామిక విప్లవానికి ముందు వాతావరణంలో సి.ఒ.టు మోతాదు 230–280 పి.పి.ఎం ఉండేది. ఇప్పుడు అది 400కి చేరింది. కార్బన్ డయాక్సైడ్ మోతాదు గరిష్ఠంగా 350 ఉంటేనే సురక్షితం అని పరిశోధనలు చెబుతున్నాయి.

ఇప్పటికే అలస్కాలో మంచు కరగడం ప్రారంభమైంది. అలస్కా దాదాపు 1.5 మిలియన్ చదరపు కిలోమీటర్లు విస్తరించింది. దానిలో ఘనీభవించిన నదులు త్వరితగతిన కరుగుతున్నాయి. ఆ కరిగిన నీరు అలస్కాని ప్రతి

## మార్పుల పర్యవసానాలు

2013 లో సగటు ఉష్ణోగ్రత మార్పు 1.4° సి

2046– 2065 లో సగటు ఉష్ణోగ్రత మార్పు 2.6° సి

2081–2100 లో సగటు ఉష్ణోగ్రత మార్పు 4.8° సి

2013 లో సముద్ర మట్టంలో మార్పు 22 సెం.మీ

2046–2065 లో సముద్ర మట్టంలో మార్పు 38 సెం.మీ

2081– 2100లో సముద్ర మట్టంలో మార్పు 82 సెం.మీ




ఏడేళ్లకి 30 సెంటీమీటర్ల మేర ముంచుతుందని అంచనా.అలస్కాలో మంచు ఏటా 75 బిలియన్ టన్నుల మేర కరిగిపోతుంది.ధృవ ప్రాంతాలలో కూడా మంచు కరిగిపోతోంది. అంటార్కిటికాలో రెండు రకాల మంచులు ఉంటాయి. నీటి మీదది. నేలపైనది. నీటిపైనది ఘనీభవించిన సముద్ర జలం. నేలపైనది చాలాకాలంగా పేరుకున్న మంచు. ఇప్పుడు కరుగుతున్నది నేలపైన మంచే. అక్కడ ఏటా 100 బిలియన్ టన్నుల మంచు కరిగి సముద్రంలోకి చేరుతోంది.

హిందూ కుష్-కరకోరం -హిమాలయ గ్లేషియర్లు (హిమపాతాలు) దాదాపు 60,000 చదరపు కిలోమీటర్ల మేర మంచుతో నిండి ఉంటాయి. అవి తూర్పు నుంచి పశ్చిమానికి 2,000 కిలోమీటర్లు ప్రయాణిస్తూ దక్షిణ ఆసియాలో నాలుగోవంతు జనాభాకి నీరు అందిస్తాయి.

అటువంటి ప్రాణదాతలైన హిమాలయ గ్లేషియర్లు 2003-2009 మధ్యలో భూ తాపోన్నతి కారణంగా 174 గిగా టన్నుల నీరు కోల్పోయామని అంచనా. ఆ కరగడం వలనే గంగ, బ్రహ్మపుత్ర నదుల్లో భీకరమైన వరదలు సంభవించాయి.

మంచు కరగడానికి వర్షాలు తోడైతే మరింత తీవ్రమైన వరదలు వస్తాయి. అయిదేళ్ల క్రితం ఇదే కారణం వల్ల పాకిస్తాన్‌లో అయిదో వంతు భూభాగం అయిదు వారాల వరకు నీటికిందే ఉండిపోయింది.



గత వారంలో ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ కంట్రోల్ (ఐపిసిసి) ఒక నివేదిక విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం ఉష్ణ సమశీతోష్ణ ప్రాంతాలల్లో వర్షాలు పడటంలో తీవ్ర మార్పులు ఉండవచ్చు. ఆఫ్రికా తూర్పు భాగంలో వర్షాభావం, పశ్చిమంలో అధిక వర్షాలు రావచ్చు. బర్మా, బంగ్లాదేశ్‌తో పాటు మన దేశంలో కూడా భయంకరమైన తుపాన్లు రావచ్చు. భూమధ్య రేఖకి దూరంగా పైన ఉండే ప్రాంతాలల్లో అధిక వర్షాలు రావచ్చు.

**ఆరోగ్యంపై ప్రభావం**

వాతావరణ మార్పుల వల్ల ఎక్కడో మంచు కరుగుతుంది. మరెక్కడో నీరు పెరుగుతుంది. గానీ మనకి పెద్ద నష్టం లేదనుకునేవారున్నారు. ఆ మార్పు వల్ల మానవులపై సూక్ష్మ జీవరాశిపై తీవ్ర ప్రభావాలు ఉంటాయనీ అవి మనుషుల శారీరక మానసిక ఆరోగ్యంపై దెబ్బ తీస్తాయని తాజా పరిశోధనలు చెబుతున్నాయి.

పెరిగే ఉష్ణోగ్రతల వల్ల ఆహార పంటలు, జీవులు తగ్గిపోతాయి. తీవ్ర ఆహార కొరత ఏర్పడుతుంది. పోషకాహార లోపం కారణంగా అనేక వ్యాధులు ప్రబలుతాయి.

అలాగే మారే వాతావరణానికి అనుగుణంగా సూక్ష్మ జీవులు వేగంగా మార్పు చెందుతాయి. అవి బలపడితే మానవుల ఆరోగ్యాన్ని దెబ్బ తీయడం సులువు. రోగాలను మోసుకొచ్చే దోమల వంటి వ్యాధి వాహకాలు పెరుగుతాయి. ఇప్పటికే మలేరియా వ్యాధి ఏటా 6,60,000 మందిని బలితీసుకుంటోంది. ఇదింకా ఉధృతమయ్యే అవకాశాలున్నాయి. డెంగూ, చికున్‌గున్యా, కలరా వంటి వ్యాధులూ ప్రజారోగ్యానికి పెను సవాళ్లు విసురుతాయి.

పర్యావరణ మార్పుల వల్ల వేడి గాలులు పెరుగుతాయి. ఇప్పటికే ఈ వేసవిలో వీటి కారణంగా ఎందరో మరణించడం పత్రికల్లో చూస్తున్నాం. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ... శతాబ్దాంతానికి 300 కోట్లకు పైగా వృద్ధులు వేడి గాలుల ప్రభావానికి గురవుతారు. ఇటువంటి పరిస్థితులల్లో మనుషుల స్థైర్యం కోల్పోయి మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది.

వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్న వాదానికి శాస్త్రీయంగా కానీ ఇతరత్రా నిదర్శనాలకి కొదువ లేదు. కొంత కాలానికి మానవ జాతి అంతరించిపోతుంది. అనే దిశలో కంటే అసలు వాతావరణ మార్పులకి కారణం ఏంటో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం వుంది. వాతావరణ మార్పులు శాస్త్రీయ రాజకీయ ఆర్థిక వ్యాపార స్థాయిలను దాటిపోయాయి. ఇప్పుడు నైతిక బాధ్యతపై దృష్టి పెట్టాలి. ఈ గ్రహాన్ని పంచుకుని నివసించే మనమే...సమిష్టిబాధ్యతతో దాన్ని కాపాడుకోవాలి.

## పెరుగుతున్న కర్బన ఉద్గారాలు

**పె**రుగుతున్న ఉష్ణోగ్రతలను 2 సి మేర ఆపడానికి కర్బన ఉద్గారాల మోతాదు 1000 గిగా టన్నులను దాటకూడదని లెక్కకట్టారు. కానీ 2011 లోనే మనం 531 గిగా టన్నుల కర్బన ఉద్గారాలను విడుదల చేశాం.

బంధం

మేజర్ జనరల్ సుబ్బయ్య తిమ్మయ్య

# నమస్తే ఇండియా

**సరిగ్గా 60 ఏళ్ల క్రితం భారత్‌లో ఆశ్రయం పొందారు 88 మంది కొరియా యుద్ధ ఖైదీలు. వారిలో అందరూ వెళ్లిపోగా ముగ్గురు మాత్రం ఇక్కడే స్థిరపడ్డారు. మన దేశ అండదండలతో కొత్త జీవితాన్ని ప్రారంభించి యుద్ధ భయాల నుంచి బయటపడ్డారు. కొరియాల్లో కుటుంబాలు ఉన్నా భారత్‌ను శాశ్వతంగా వదిలి వెళ్లలేకపోతున్నారు.**

ప్రచ్ఛన్న యుద్ధ ప్రభావంతో ఆజ్యం పోసుకున్న కొరియా యుద్ధం 1953లో జరిగింది. పది లక్షల మంది వరకు ఆ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారని అంచనా. లక్షల మంది శత్రు సైన్యాలకు చిక్కి యుద్ధ ఖైదీలుగా దారుణ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడారు. సూర్యోదయానికి అస్తమయానికి మధ్య వారి ప్రాణాలు నిలుపుకోగలరా అనే విధంగా ఉండేవి అక్కడి జైళ్లలోని పరిస్థితులు. ప్రాణం మిగిలితేనే గొప్ప అనుకునే ఆ యుద్ధ ఖైదీలకు స్వేచ్ఛను ప్రసాదించింది ఐక్యరాజ్య సమితి నేతృత్వంలోని శాంతి దళాలు. మన భారతీయ సైనికుడు మేజర్ జనరల్ సుబ్బయ్య తిమ్మయ్య నాయకత్వాన పనిచేసిన పోలాండ్, స్విట్జర్లాండ్, చెకోస్లేవియా, స్వీడన్, భారత శాంతి దళం ఇరు పక్షాలను ఒప్పించి యుద్ధ ఖైదీలను రక్షక ప్రాంతాలకు తరలించే విషయంలో ప్రపంచ ఖ్యాతిని ఆర్జించాయి.

యుద్ధ కారాగారాల నుంచి లక్షా డెబ్బై వేల మంది చైనా, కొరియా సైనికులు స్వేచ్ఛా వాయువులు పీల్చు కున్నారు. కొందరు తమ సొంత ప్రాంతాలకు వెళితే, యుద్ధం మిగిల్చిన గాయాల వల్ల కొందరు భయంతో వేరే దేశాల ఆశ్రయాల్ని పొందారు. అలా భారత్‌కు వచ్చిన 88 మందిలో లెఫ్టినెంట్ హువా, మేజర్ పీటర్ కియోల్, కోయి ఇన్‌కియోల్‌లు ఇక్కడే స్థిరపడ్డారు. కోయి విదేశాంగ కార్యాలయంలో ఉద్యోగం పొందాడు. మిగతా ఇద్దరికి వ్యాపారం నిర్వహించుకునేందుకు ఆ రోజుల్లోనే 10 వేల రూపాయల సొమ్మును ప్రభుత్వం ఇచ్చింది. తొలుత మద్రాస్‌లో వారంతా అక్కడి వేడి, ఉక్కపోతల భిన్న వాతావరణానికి ఇమడలేక డెహ్రాడూన్ చేరారు. క్రమంగా ఢిల్లీలో స్థిరపడి నేడు ఫ్రెండ్స్ కాలనీగా పిలుస్తున్న అప్పటి మరియా గార్ ప్రాంతంలో ఓ చర్చి స్థలాన్ని లీజుకు తీసుకుని పౌల్ట్రీ వ్యాపారాన్ని ప్రారంభించారు. స్థానిక భాష అయిన హిందీతో పాటు ఇంగ్లీష్‌ను నేర్చుకుని అక్కడి ప్రజలతో తేలిగ్గా కలిసిపోయారు. వారిని స్థానికులు ఆదరించడంతో వారికి కొత్త జీవితం లభించింది. క్రమంగా వ్యాపారంలో లాభాలను ఆర్జించి, ఓ దశలో ఢిల్లీలో అత్యధికంగా కోడి గ్రుడ్లను ఎగుమతి చేసే వరకు వెళ్లిపోయారు. గ్రేటర్ కైలాస్‌లో నివాసాలను స్థిరపరచుకున్నారు. 1969లో హువా ఓ మిత్రుని సాయంతో సియోల్ వెళ్లి అక్కడి అమ్మాయిని వివాహమాడాడు. ఈ సందర్భంలోనే అతడికి తప్పిపోయిన తన తల్లి, తమ్ముడు ఆచూకీ దొరికింది. వారు సియోల్‌లోనే నివసించే సరికి ఆయన సంతోషం రెండింతలైంది. కుటుంబాన్ని వెంట బెట్టుకుని భారత్‌కు తిరిగి వచ్చిన హువా జంట ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. పట్టణాభివృద్ధి పనుల్లో పౌల్ట్రీ ఫామ్ స్థలం పోవడంతో అప్పటి వరకు ఆర్జించిన డబ్బుతో హువా కొత్త వ్యాపారంలోకి ప్రవేశించాడు. అప్పట్లో విగ్గుల తయారీ కేంద్రంగా కొరియా ఉండేది. ఆ వ్యాపారంతో పాటు కాశ్మీర్ పట్టు పరిశ్రమకు కావాల్సిన టెక్నాలజీని కొరియా నుంచి తెప్పించి మంచి లాభాలను పొందాడు. విగ్గులకు అవసరమైన తల వెంట్రుకల కొరతను దృష్టిలో పెట్టుకుని తిరుపతి, న్యూఢిల్లీలోని పహాడ్‌గంజ్‌ల వద్ద జుట్టును సేకరించి కొరియాకు ఎగుమతి చేశాడు. ఇలా వ్యాపారాలు కలిసి వచ్చి ఉన్నత జీవితంలో స్థిరపడ్డాడు. ఆయన కొడుకు సియోల్‌లో వ్యాపారిగా, కూతురు అమెరికాలో ఓ జర్మన్ కంపెనీకి పనిచేస్తోంది. మంచి జీవితాన్ని ప్రసాదించిన భారత్‌ను, మేజర్ జనరల్ తిమ్మయ్యను ఆయన ఇప్పటికీ గుర్తుచేసుకుంటాడు. భారత్ తన మాతృదేశమైపోయిందని వినమ్రంగా నమస్కరిస్తాడు హువా. కొన్నేళ్ల క్రితం ఢిల్లీ గోల్ఫ్ క్లబ్ దగ్గర జరిగిన కారు యాక్సిడెంట్‌లో పీటర్ చనిపోగా, హువా తన శేష జీవితంలోకి అడుగుపెట్టి పిల్లలతో గడిపేందుకు సియోల్, న్యూఢిల్లీల మధ్య రాకపోకలు సాగిస్తూ కాలం గడుపుతున్నాడు. ✦

# కిస్సా - కుర్సీకా

- మంత్రవాది మహేశ్వర్

◆ కథ



"అమ్మా పద్మజా.. నువ్వు వంశీ చెప్పే మాటలు వినాలమ్మా. ఎంతకాదన్నా అతను నీ భర్త. ఈ విషయంలో నేను వంశీనే సమర్థిస్తాను"

"మావయ్యగారూ.. ఈ విషయంలో నేనింకేం చెప్పాలి. మీరే పద్మజకు అర్థమయ్యేలా చెప్పగలిగినవారు" చెప్పేశాడు వంశీమోహన్.

నిజం చెప్పాలంటే వంశీకి చాలా కోపం వచ్చింది. కానీ బయట పడకుండా లోపల అణచుకోగల అసలైన రాజకీయం తెలిసినవాడు. ఎవరు అతనిని చూసినా, లోపల రగిలే కోపం తెలుసుకోలేరు. పద్మజ అతనితో జీవితాన్ని పంచుకున్న సహధర్మ చారిణి. గొప్పింటి బిడ్డ. చదువు కున్నది... తెలివైనది... భర్త కోపాన్ని పసిగట్టలేనంత అమాయకురాలేం కాదు. వంశీ దవడ ఎముక దగ్గర ఎగిసిపడే నరం కదలికల్ని గుర్తించక పోలేదు. వంశీ ఎంత అందమైన వాడు... నలభైలో కూడా నవమన్మథుడిలా... తను ఎంతగా ప్రేమిస్తోంది అతనిని.. అయినా సరే ఆ పని చేయడానికి మనసొప్పడం లేదు. పద్మజ మౌనం వహించింది.

"... ఇంక ఆలోచనలు ఆపి, ఈ పత్రాలపైన సంతకాలు చేయి"

"అవును పద్మజా... అతను చెబుతున్నట్లు చేయడమే అన్ని విధాలా మంచిది"

అవి మామూలు కాగితాలు కావు. రేపు రాబోయే ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థిగా పోటీకి ఉద్దేశించబడిన నామినేషన్ పత్రాలు. అందుకే ఈ తటపటాయింపు.

నిజానికి పద్మజ రాజకీయాలలో పండిపోయిన కుటుంబంలో పుట్టింది. తాత, తండ్రి, మావయ్యలు, వరుసకు అన్నదమ్ములు... అంతా ఏదో ఒక రాజకీయ పార్టీకి చెందినవారే. రకరకాల ఆలోచనలు, అభిప్రాయాలు కలిగినవాళ్ళు కావడం చేతో, గెలుపు అవకాశాలు దృష్టితోనో వాళ్ళంతా భిన్నమైన పార్టీల్లో వున్నారు.

తాతగారు - రాజకీయాల్లో పండిపోయిన వ్యక్తి. కుటుంబ సభ్యులందర్నీ గుర్తుంచుకోమని ఎప్పుడూ చెప్పే మాటలు- ఎన్నికల్లో ఏ పార్టీ ఓడుతుందో, ఏది గెలుస్తుందో చెప్పడం అంత తేలిక విషయం కాదు. ఏ పార్టీయైనా గెలవ్వచ్చు. అయితే మన కుటుంబం ఓడిపోకూడదు. ఏదో ఒక పార్టీ టిక్కెట్టుపై గెలిచి అధికారంలో వుండాలి. సిద్ధాంతాలు సరే కానీ సీటు ముఖ్యం. ఆ మాటల్లో ఎంత అనుభవముందో తెలుస్తుంది. తన తండ్రి ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసారు ఎంతో కాలం. కజిన్ కేంద్రమంత్రి, బాబాయి మరో రాష్ట్రంలో మంత్రి, బంధువర్గం వీళ్ళ పుణ్యమాని మంచి వ్యాపారాలు చేసుకోగలు గుతున్నారు. కాంట్రాక్ట్‌లు సంపాదించుకో గలుగుతారు. ఎవరు ఏ పార్టీకి సంబంధించిన వారైనా బహిరంగంగా ఒకరి మీద మరొకరు నిప్పులు చెరిగేలా మాట్లాడుకున్నా అందరి మధ్యా ఎంతో సఖ్యత వుంది.

పద్మజకు తెలుసు - తన తల్లితండ్రులు ఎప్పుడూ కొడుకు పుట్టాలనే తపించారు. దానికోసం వారు చేయని పూజలు, వ్రతాలూ లేవు.. దర్శించని దేవాలయాలు లేవు. కానీ తానొకటి తలచిన దైవమొకటి తలచునన్నట్లు వాళ్ళ కోరిక నెరవేరలేదు. వంశీ జీవిత భాగస్వామి కావడంతో ఆశలు చాలా వరకు ఫలించాయి. తమ ఆశలన్నీ అల్లుడివైపు మళ్ళాయి. అతని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా చేసాయి.. వారి వైవాహిక జీవితం ఆనందంగానే నడుస్తోంది. పద్మజకు తమకున్నదాంట్లో తృప్తి ఉంది. అక్క డితో చాలనుకుంది. రాజకీయాల్లోకి అడుగుపెట్టి ఎదగాలనే లాంటి ఆలోచనలు ఎంత మాత్ర మూ లేవు. కానీ ఇప్పుడీ పరిస్థితి.....

"నేనేమన్నా నువ్వు జీవితాంతం రాజకీయాల్లో వుండాలని చెబుతున్నానా. ఏదో కొద్ది కాలంపాటు. అది ఎందుకో, ఏమిటో నీకు బాగా తెలుసు. ఆపద్ధర్మంగానే అడుగుతున్నాం. అర్థం చేసుకో...." వంశీ.

"సరే... కానీ"

"కానీ.. కానీ.. కానీ. ఏమిటా కానీ. నేనేదో నూతిలో దూకమన్నట్లు ఆలోచిస్తున్నావు." గట్టిగా అనేసిన వంశీ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

చేసేదిలేక తండ్రివైపు తిరిగింది పద్మజ... అతడేం చెబుతాడో వినాలని. పద్మజకు ఆరేళ్ళ వయసున్నప్పుడే ఒక ల్యాండ్‌మైన్ బ్లాస్ట్‌లో తల్లి చనిపోయింది. ఆ రోజు నుంచీ ఏ లోటూ రాకుండా చూసుకుంటూ వచ్చాడు తండ్రి. కావల్సినవన్నీ

సమకూరుస్తూ, ఏ మాటనూ కాదనకుండా ఎంతో ప్రేమను పంచాడు.

పద్మజ అయోమయస్థితిని తప్పుగా అర్థం చేసుకున్నాడు తండ్రి. ఎదురుగా వున్న సోఫాలోంచి లేచి, ఆమె పక్కన దగ్గరగా కూర్చున్నాడు.

"అమ్మా.. మొండిగా వుంటే ఎలాగ చెప్పు.. ఈ సీటును పార్టీ వదులుకోలేదు"

"అది కాదు నాన్నా... మరొకరినెవరినైనా ఆలోచించచ్చు కదా"

"అమ్మా.. ఎంతో అనుభవంతో చెబుతున్నాను. న్యాయవ్యవస్థ ఎంతో శక్తి వంతమైనది. అందుకే వంశీ రాజీనామా చేయాల్సివచ్చింది. మనకు తెలుసు అతను ఎంత ముక్కుసూటి వ్యక్తో, పార్టీ పేరు ప్రతిష్టలకు మచ్చ రాకూడదనే వుద్దేశ్యంతో ఇతన్ని బలిచేయాల్సి వచ్చింది. నువ్వు పోటీ చేయలేదనుకో, ఆ సీటు అపోజిషన్ వాళ్ళు గద్దలా తన్నుకుపోయే అవకాశాలు ఎక్కువవుతాయి... మన పార్టీలోనే వేరే అభ్యర్థిని నిలబెడితే, మళ్ళీ ఎన్నికలనాటికి అతడా స్థానంలో పాతుకుపోయి కొరకరాని కొయ్యగా మారవచ్చు... చెప్పినా సీటును వదలకపోవచ్చు..... అధికారమమ్మా అధికారం... నేను బాగా ఆలోచించాను... నువ్వు ఆ పత్రాలపై సంతకాలు చేయడమే మంచిది."

చివరికి పద్మజ 'అలాగే' అనే నిర్ణయానికొచ్చింది. ఏది మంచో తండ్రికి బాగా తెలుసు. వంశీ కోరికా అదే. సంతకాలు చేసిన తరువాత తన జీవన విధానం ఎలా మారుతుందో కూడా తెలుసు. అప్పాయింట్‌మెంట్లు, మీటింగులు, జెండాలు, జెండాలు, జనం, నినాదాలు, విధానాలు.... ఒకటే హడావిడి.

నెమ్మది నెమ్మదిగా ఊహించిన విధంగానే పద్మజ జీవన విధానమే మారిపోయింది. రెండేళ్ళు దొర్లిపోయాయి. పరిస్థితులు ఎంత మారిపోయాయి... ఒకప్పుడు పద్మజకు రాజకీయాలంటేనే పడేది కాదు. ఇప్పుడు అది బాగా వంటబట్టింది. పదవి మహిమ.. నరనరాల్లోకి పాకింది. సారథ్యం వహిస్తున్న ధోరణి... పొగడ్తలు... వార్తల్లో వ్యక్తిగా... ఎంతో పలుకుబడి... మాటకు పెరిగిన విలువ. నిరంతరం దిన పత్రికలు, టీవీ ఛానళ్ళలో 'నామ జపం'... ఫలానా వారి మనవరాలు, కూతురు, భార్యా కానీ ఇప్పుడో పద్మజా నిర్మల, ఎం.పి.

పద్మజ పక్కనే నడుస్తున్న సాంబమూర్తి ఏదో చెప్పబోతున్నాడని తెలిసి ఆగింది–

"మేడమ్... పనైపోతుంది" అన్నాడు.

"అలాగే" అన్జెప్పి కారెక్కింది.

ఇల్లు చేరే సరికి రాత్రి పదకొండు.

వంశీ ఎప్పటిలాగే ఆమె కోసం నిరీక్షిస్తున్నాడు. పద్మజకు ఎంతో సపోర్టివ్‌గా ఉంటున్నాడు. సహాయసహకారాలే కాదు, రాజకీయాల్లో తన అనుభవాన్ని ఆమెకు పాఠాలుగా చెబుతున్నారు. ఆమె ఎదుర్కొనే ఇబ్బందుల్ని ఎంతో ఓర్పుగా వింటూ సూచనలు చేస్తున్నాడు.

"చాలా కష్టంగా అనిపిస్తోందా... స్వీట్‌హార్ట్"

"ఊ" అంటూ సోఫాలో కూలబడింది.

"ఇంకా ముఖ్యమైన పేపర్ వర్క్ మిగిలిపోయింది" ఊపిరి గట్టిగా తీసుకుని వదిలి... కళ్ళను గట్టిగా మూసుకుంది.

వంశీ దగ్గరగా వచ్చి ఆమె భుజాలను మర్దన చేసాడు ప్రేమగా.

"డార్లింగ్.. త్వరలో నీకు ఈ టెన్షన్లు అన్నీ తొలగిపోతాయి. నువ్వు కోరుకునే విశ్రాంతి దొరుకుతుంది"

"వంశీ! ఏమిటి మీరంటున్నది.. ఎలా"

"ఎన్నికలు"

"అయితే ఏమిటి"

"నేను పోటీ చేస్తాను... నువ్వు ఇంటి బాధ్యతలు చూసుకోవచ్చు. పిల్లల చదువులు అనీ దెబ్బతింటున్నాయి. అని నువ్వే అన్నావుగా చాలా సార్లు."

"ఒక్క క్షణం ఆగు... ఏమిటంటున్నావు"

"అనడానికేముంది. తెలిసిందేగా... ఈసారి నేను పోటీ చేస్తాను"

"కానీ ప్రజల కోరిక మేరకు నేను మంచి సేవలే అందిస్తున్నాను. వాళ్ళు నన్ను ఎంతగానో అభిమానిస్తున్నారు... కోరుకుంటున్నారు... చూస్తున్నావుగా.. పత్రికలు, ఛానళ్ళు నాకు అండగా నిలుస్తున్నాయి."

వాటిలో చాలా వరకూ మన పెట్టుబడులే వున్నాయి అన్న నిజాన్ని అతనూ ఎత్తలేదు.

"నేనూ కాదనట్లేదు డార్లింగ్... నువ్వు అద్భుతమైన పని చేస్తున్నావు. ప్రజల్లోకి చాలా కొద్ది కాలంలో బాగా వెళ్ళగలిగావు... ఐ యగ్రీ... ఇప్పుడింక ఆ అవసరంలేదు. ఇంతకాలం నా సీటు చల్లబడిపోకుండా హాట్‌గా ఉంచినందుకు థ్యాంక్స్"

వంశీ నవ్వుతూ ఆమె దగ్గరగా వచ్చి నుదుటిమీద ప్రేమతో ముద్దు పెట్టాడు. అతను చెప్పినదాంట్లో నిజముండచ్చు... కానీ పద్మజ ఆలోచన మరోలా వుంది.

"వంశీ... నువ్వు చెబుతున్నది సమంజసమే.... కాదనను. నేను రాజకీయాల్ని ఒక వృత్తిగా, చిత్తశుద్ధితో తీసుకోవడం మొదలుపెట్టాను"

"ఎంత మార్పు..." వ్యంగ్యంగా అంటూ చప్పట్లు కొట్టాడు.

"ఇంతకీ నీ ఉద్దేశ్యం" అడిగాడు.

'ఏమీ లేదు. నేను చాలా అలసిపోయివున్నాను. నిద్రపోవాలి.. రూపొద్దున్న ఏడుగంటలకు ముఖ్యమైన సమావేశముంది కలెక్టర్లతో..."

వంశీ చూసిన చూపు ఆమెకు నచ్చలేదు. అందులో 'అసహ్యం' కనిపించింది. నిద్ర పోదామనుకున్నా పట్టలేదు. ఏవేవో ఆలోచనలు.... అన్నీ వదిలేసి పాత రోజుల్లోలా హాయిగా పిల్లల గురించి ఆలోచిస్తూ వారి సంరక్షణలో గడపాలని ఉంది. శ్రీమతి పద్మజగానే ఉండిపోవాలని ఉంది. కొత్తగా వచ్చిచేరిన పదవి విడిచి పెట్టాలని ఉంది.– భర్తకు సహాయ సహకారాలు అందిస్తూ ఇంటి వ్యవహారాలు చూసుకోవడంలోనే సంతృప్తి ఉందనిపించింది... ఒక వారం పాటు తనకు పని ఒత్తిళ్ళు.... లోపల మధనపడడం తగ్గలేదు. పదవిలో వుండాలా... భవిష్యత్తు ఏమిటి? శ్రీమతి పద్మజకు మార్కులు ఎక్కువ వచ్చాయి. పద్మజా నిర్మల ఎం.పి.కంటే పరిస్థితులు గమనిస్తున్న వంశీ ప్రశాంతంగా కనిపించాడు మరి. రాత్రి పడకగదిలో – మంచం మీద పద్మజ, వంశీలు పడుకుని వున్నారు. గోడ గడియారం టిక్‌టిక్‌లు తప్ప అంతా నిశ్శబ్దం. బెడ్ లైట్ వెలుతురు మసకమసగ్గా....వంశీ ముఖంలో టెన్షన్‌ను చూసింది.

"వంశీ.. నీకో విషయం చెప్పాలనుకుంటున్నాను. స్వీట్ హార్ట్.. పదవిలోకి వచ్చి కొంత కాలమే అయినా ఎంతో అనుబంధం ఏర్పడింది. ఓ సంతృప్తి కలుగుతోంది...."

"పద్మజా నువ్వెలా ఆలోచించినా ఓ.కె. నిర్ణయం నీ ఇష్టం. నేను అడ్డుపడతానని ఎందుకను కుంటున్నావు"

"నిజంగా అలాగే ఫీలౌతున్నావా... నాకెంతో హాయిగా ఉంది. థ్యాంక్యూ సోమచ్" అని అతనిని దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టింది.

"ఇందుకేనా.. నీ ప్రవర్తనలో ఏదో వింత మార్పు కొద్ది రోజులుగా"

"సారీ డార్లింగ్... నువ్వెలా రియాక్ట్ అవుతావో నాకు తెలియదుగా. ఎందుకంటే ఈ సీటు మీద నీకున్న మక్కువ అలాంటిది... అందుకు."

"ఒక్క క్షణం ఆగు... ఏమిటంటున్నావు.. ఈ సీటు...." లైటు స్విచ్ ఆన్ చేసి కూర్చున్నాడు.

".... అంటే ప్రజాసేవలో ఇలాగే కంటిన్యూ అవుదామని. కాబట్టి ఇదే సీటు మీద రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తాను సహజంగా"

"ఆ ఆలోచనను బుర్రలోంచి తీసి అవతల పడేయ్. ఏమైంది నీకసలు. నా సీటును నువ్వు కొంతకాలం కాపాడడం కోసం పనిచేస్తున్నావన్న భావనే లేదు. మీ నాన్న నీ కోసం ఒక కచ్చితంగా గెలిచే సీటు గురించి ఆలోచిస్తారులే.. ఆయన మేధావి. ఆ ఆలోచనలో ఉండు" అసలు ఉద్దేశ్యం బయటపడింది.

"నేనెందుకు ఇంకో సీటు కోసం ప్రయత్నించడం.... ఆ పని నువ్వే చేయొచ్చుకదా"

"ఏమిటి నా నిర్ణయాన్ని ఎదిరిస్తున్నవా... అసలు రాజకీయాలు నీకేం తెలుసని వంశక్రమం తప్ప వేరే ఏం అర్హత ఏడిసిందని" వెటకారం చేసాడు.

"వంశీ ప్లీజ్... అలా మాట్లాడొద్దు"

"చేసింది చాలు... మీ కుటుంబ సభ్యులంతా నన్ను చిన్న చూపే చూసారు. ప్రతి విషయాన్ని చిరునవ్వుతో సరిపెట్టుకుంటూ వచ్చాను. నేను ఈ

సీటు వదిలిపెడతానని ఎలాగనుకుంటున్నావు. మన ఇద్దరికే తెలుసు... ఈ సీటు ఎంత ముఖ్యమో, గెలుపు అవకాశాలు ఎంత బలంగా వున్నాయో. ఈ పదవిలో ఉండబట్టే నాకీ గౌరవం. బరిలోకి దిగి పోటీ యివ్వకుండా వుంటాననే తప్పుడు ఆలోచన పెట్టుకోకు.. ఓకే."

పద్మజ వంశీలోని ఆ పట్టుదల అదీ చూసి చలించిపోయింది. ఆ కోపానికి ఆశ్చర్యపోయింది. తగాదా పడలేదు. పడదలుచుకోలేదు... ఎందుకో– "వంశీ ప్రశాంతంగా ఉండు. ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. మంచి మార్గమేర్పడుతుంది"

"చూడు పద్మజా.. జాగ్రత్తగా విను. ఇంక ఈ విషయంలో చర్చించడానికి ఏంలేదు... సమస్యే లేదు. ఇది నా సీటు... నా కోసం ఉద్దేశించబడింది. నా సమస్యే కాదు... నీకు పోటీ చేయాలనిపిస్తే మరో ప్రదేశం ఎంచుకో... అర్ధమైందా"

"అలాగే.. మీ కోరిక ప్రకారమే కానిద్దాం" మెత్తగా అంది.

"పద్మజా... రాజకీయ చదరంగం గురించి నీకు అవగాహన లేదు. నీలాంటి సంస్కారవంతురాలు నాకు భార్యగా లభించడం నా పూర్వజన్మ సుకృతం. అదే నా అదృష్టం... నేను నిజంగా ఊహించలేదు, నేను చేసిన పదవిని నువ్వు చేపట్టి అంత సమర్ధవంతంగా నిర్వహిస్తావని నువ్వుండాల్సింది ఎప్పుడూ నా పక్కనే. నీ సపోర్టే నా బలం... నువ్వు ఆదర్శవంతమైన అర్ధాంగిగా ఈ ప్రపంచం చూడాలి"

"వంశీ నాకర్ధమైంది నువ్వంటున్నది. నాకంటే ఆదర్శవంతమైన ఇల్లాలు ఉండదు. నిన్ను అనవసరంగా కష్టపెట్టానేమో ఇన్నాళ్ళు.. నీకు ఎటువంటి టెన్షన్లు లేకుండా నేను చూసుకుంటాను.. అన్నీ తొలగిపోతాయనుకో..."

"పద్మజా నాకు తెలుసు... నా కోణంలో ఆలోచించగలవని.. ఇద్దరం కలిస్తే ఎదురేముంటుంది. ఏమంటావు" గట్టిగా దగ్గరికి తీసుకున్నాడు.

"పద్మజా... దీనికి నువ్వు అంగీకరించినట్టేనా... ఇదేగా నీకు కావల్సింది" అని అడిగాడు మరుసటి రోజు తండ్రి.

"నాన్నా! జీవితంలో ఏది నాకు కచ్చితంగా లభిస్తుందో తెలియదు. అంత నమ్మకమూ లేదు. వంశీతో నువ్వే మాట్లాడి అర్ధమయ్యేలా చెప్పు"

"నువ్వు ఏది కోరుకుంటే అదీ జరుగుతుందమ్మా... విషయం నాకొదిలిపెట్టి నువ్వు నిశ్చింతగా ఉండు" అని ఆ తరువాత ఆయన వంశీతో మాట్లాడడానికి, పద్మజ పార్టీ కార్యాలయానికి వెళ్ళిపోయారు.

❑ ❑ ❑

మావయ్య దగ్గర్నుంచి ఫోన్‌కాల్...పద్మజ సమావేశం మధ్యలో ఉంది......ఇంటికి అర్జంటుగా రమ్మని చెప్పి, కూడా తీసికెళ్ళడానికి చిన్నాన్నగారబ్బాయి సతీష్‌చంద్ర వచ్చాడు. అంతా హడావిడి. కార్లు వేగంగా కదిలాయి. పద్మజ బంగళా చేరేసరికి పోలీసులు.

"ఏం జరిగింది" పద్మజలో కంగారు కనిపించింది.

విచారం అలుముకున్న వాతావరణం. పద్మజ భయంభయంగా, ఓ మూల కుర్చీలో మౌనంగా కూర్చున్న తండ్రి దగ్గరకి గబగబా వెళ్ళింది. ఆయన కాళ్ళ పక్కన కూలబడిపోయింది. కాసేపు మౌనం తరువాత–

"నాన్నా"

"అమ్మా... వంశీ ఇక మనకు లేడమ్మా... ఇంట్లోంచి బయటకు బయలుదేరి వెళ్ళబోతుండగా ఎవరో షూట్ చేసారు"

"బహుశా... ఎవరో ప్రతిపక్షం వాళ్ళు రాబోయే ఎన్నికల బరిలో వంశీ బలమైన అభ్యర్ధి అని, అతన్ని తప్పించాలని ఈ పని చేసి ఉంటారు"

పద్మజ ఏడుస్తూ తండ్రి కేసి చూసింది... రాజకీయాల్లో పండిపోయిన తండ్రి... సమాజంలో పెద్ద మనిషి... పార్టీ వ్యవహారాల్లో ప్రముఖ వ్యక్తి. తడి ఏమాత్రం కనిపించని ఆ కళ్ళను చూసి విషయం అర్ధంచేసుకుంది. ... ఇదా తను కోరుకున్నది. కళ్ళు తిరిగి అక్కడే పడిపోయింది. హాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్నవారు ఒకరొకరుగా వస్తున్నారు.. అధికారులు, అనధికారులు, రాజకీయ నాయకులు....పోయిన వంశీ కోసం కాదు... ఉన్నవాళ్ళను ఓదార్చడం కోసం.

లోపల గదిలో తండ్రి పక్కన కూర్చున్న పద్మజ ఆయన చేతులు పట్టుకుంది ధైర్యం కోసం.

"నాన్నా"

"పద్మజా.. ఏడవకు. ధైర్యం తెచ్చుకో... నాకు తెలుసు. ఈ పరిస్థితుల్లో అది ఎంత కష్టమో... చూసినవాళ్ళు నువ్వెంత ధైర్యస్థురాలివో అనుకోవాలి. వంశీ చేసిన మంచి పనులు వృధా కాలేదమ్మా.... ప్రతి ఒక్కరికీ తెలియాలి. ముఖ్యంగా మీడియాకు, పార్టీకి, ప్రజలకు... నువ్వు పోటీ చేసినా, చేయకున్నా వంశీ చేసిన గొప్ప పనులు కొనసాగించాలి. చెబుతున్నానని మరోలా అనుకోకు... నీ శ్రేయస్సుకోరే చెబుతున్నా.... తెల్లచీర కట్టుకో... ఆ బొట్టు కూడా..... భర్తను పోగొట్టుకున్నా పద్మజమ్మ తల్లి ప్రజలకు సేవ చేయడానికొచ్చింది అనుకోవాలంతా...."

లోపల నుంచి జనంలోకి వచ్చారు.. ఓదార్పులు మొదలయ్యాయి.

అంతా వంశీ పార్ధివ దేహాన్ని పార్టీ కార్యాలయంలో ఉంచే ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి ప్రజల సందర్శనార్థం...

అక్కడికొచ్చిన మీడియాలో తమ ప్రియతమ నాయకుడిని పోగొట్టుకున్న బాధను ఎందరో వ్యక్తపరుస్తున్నారు....

చాలా ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారం కూడా ప్రారంభమైంది... ✦



# దమ్ కీమా

**కావలసిన పదార్థాలు**

కీమా- అర కేజీ, ఉల్లిపాయలు-నాలుగు, కొబ్బరి-వంద గ్రాములు, గరం మసాలా-చెంచా, గసగసాలు-రెండు చెంచాలు, కారం, ఉప్పు-రుచికి తగినంత, పసుపు-పావు చెంచా, పెరుగు-వంద గ్రాములు, నూనె-పావు కేజీ, కొత్తిమీర, పుదీనా-కట్ట చొప్పున, పచ్చి మిర్చి- నాలుగు

**తయారీ విధానం**

ముందుగా పొయ్యి మీద బాణలి పెట్టి కొబ్బరి, గసగసాలు, ఉల్లిపాయ ముక్కలు వేయించి ఆ తరువాత మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని బాగా కడిగిన కీమాలో కలపాలి. దీనికి మిగిలిన పదార్థాలను కూడా చేర్చి సరిపడా నీరు పోసి కుక్కరులో పదిహేను నిమిషాలు ఉడికించాలి. మూత తీసి మళ్లీ పొయ్యిమీద పెట్టాలి. మంట తగ్గించి కీమా దగ్గరపడి మాడు వాసన వచ్చేంత వరకు వేయించాలి. దమ్‌కీమా ను కొత్తిమీర పుదీనా, ఉల్లిపాయ ముక్కలతో కలిపి వడ్డిస్తే చాలా రుచిగా ఉంటుంది.

# దనియా కీమా మటర్

**కావలసిన పదార్థాలు**

మటన్ కీమా-అర కిలో, పచ్చి బఠాణీ-అర కప్పు, కొత్తిమీర తురుము-4 టేబుల్ స్పూన్లు, నూనె-4 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయలు-రెండు , గరం మసాలా- టేబుల్ స్పూను, అల్లం వెల్లుల్లి-2 టీస్పూన్లు, ధనియాల పొడి-3 టేబుల్ స్పూన్లు, కారం -2 టీ స్పూన్లు, పెరుగు -అర కప్పు, ఉప్పు-సరిపడా, నెయ్యి- టీ స్పూను

**తయారీ విధానం**

ఉల్లిపాయలు ముక్కలుగా కోయాలి. బఠాణీలు విడిగా ఉడికించి ఉంచాలి. చిన్న గిన్నెలో ధనియాల పొడి ,కారం,పసుపు, ఉప్పు, పెరుగు కలిపి పక్కన ఉంచాలి. బాణలిలో నూనె వేసి కాగాక ఉల్లిముక్కలు వేసి వేయించాలి. తరువాత గరంమసాలా అల్లం వెల్లుల్లి వేసి కలపాలి. ఇప్పుడు పెరుగు మిశ్రమం కూడా వేసి ఓ నిమిషం ఉడికించాలి. తరువాత కీమా వేసి ఓ రెండు నిమిషాలు వేయించాలి. తరువాత తగినన్ని నీళ్ళు పోయాలి. టీ స్పూను నెయ్యి కూడావేసి మూత పెట్టి నీళ్ళన్నీ ఆవిరయ్యే వరకు ఉడికించాలి. ఇప్పుడు బఠాణీలు వేసి మరో కప్పు నీళ్ళు పోసి ఉడికించాలి. దించే ముందు కొత్తిమీర తురుము చల్లాలి.

# హలీమ్

**కావలసినవి**

మాంసం- రెండు కేజీలు, పలుకుల్లా చేసుకున్న గోధుమలు- మూడు కప్పులు, అల్లం వెల్లుల్లి ముద్ద- నాలుగు టేబుల్ స్పూన్లు, మినపప్పు, సెనగపప్పు-అర కప్పు చొప్పున, పెరుగు - ఒకటిన్నర కప్పు, వేయించిన ఉల్లిపాయలు- కప్పు, జీడిపప్పు-అరకప్పు, సాజీరా-చెంచా, యాలకులు- రెండు, గులాబీ రేకలు-యాభై గ్రాములు, లవంగాలు- రెండు మూడు, యాలకులు-రెండు, నెయ్యి-అర కప్పు, కొత్తిమీర తరుగు -కప్పు, పుదీనా ఆకులు-పావు కప్పు, పచ్చిమిర్చి-ఐదారు, ఉప్పు-సరిపడా, నూనె-అర కప్పు, పొట్లీ మసాలా-కొద్దిగా (వేడి నీటిలో వేసుకోవాలి . ఇది బజార్లో లభిస్తుంది)

**తయారీ**

గోధుమల్ని నీటిలో అరగంట సేపు నానబెట్టాలి. మాంసాన్ని శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. ఇప్పుడు మాంసం ముక్కలకు సరిపడా అల్లం వెల్లుల్లి ముద్ద, చెంచా ఉప్పు చేర్చి బాగా కలిపి ఉడికించాలి పెట్టుకోవాలి. అలాగే గోధుమలు, పప్పులు, మూడు నాలుగు పచ్చి మిర్చి, అరచెంచా మిరియాలు, ఎనిమిది నుంచి పది కప్పుల నీళ్ళు తీసుకుని అరగంట సేపు ఉడికించాలి. మాంసాన్ని మిక్సీలో వేసి మెత్తగా అయ్యేలా రుబ్బుకోవాలి. బాణలిలో నూనె వేడి చేసి మిగిలిన మసాలా దినుసులు, జీడిపప్పు, ఉల్లిపాయ ముక్కలు, గులాబీ రేకలు,మాంసం పచ్చి మిర్చి కొత్తిమీర వేసి బాగా వేయించాలి. రెండు మూడు నిమిషాలయ్యాక పెరుగు చేర్చి మరో పదిహేను నిమిషాలు వేయించాలి. ఇందులో మూడు కప్పుల పొట్లీ మసాలా, నీళ్ళు వేసి బాగా మరిగించాలి. ఉడికించిన గోధుమ మిశ్రమంలో కొద్దిగా నెయ్యి వేయాలి. అవసరమైతే మరికాస్త ఉప్పు కూడా చేర్చి అరగంట పాటు పొయ్యి మీద ఉంచాలి. దింపే ముందు మిగిలిన నెయ్యి వేస్తే సరి. వేడివేడి హలీమ్ సిద్ధం.

## చేప బొమ్మ గీద్దాం

మీకు చేపలంటే చాలా ఇష్టం కదూ. అయితే ఈ రోజు చేప బొమ్మను ఎలా వేయాలో నేర్చుకుందాం.



## ముఖ చిత్రాలు

పిల్లలూ ఈ చిత్రంలో ఎన్ని ముఖ చిత్రాలున్నాయో గుర్తిస్తారు కదా.

## చుక్కలు కలపండి



## రంగులేద్దాం

ఈమె అవంతి పురం యువరాణి. ఆర్టిస్టు అంకుల్ ఆమె బొమ్మ వేశాడుకానీ రంగులు వేయడం మర్చిపోయాడు. మరి ఆపని మనం చేద్దామా.

## దారి కనుక్కోండి

## ఎక్కువసార్లు ....

ఇక్కడ నాలుగు యాపిల్ పళ్లున్నాయి. ఇంతకీ ఇందులో ఎక్కువ సార్లు కొరికిన యాపిల్ ఏదో చిటికెలో చెప్పాలి.

## ఏయే జంతువులు ఉన్నాయి

ఈ చిత్రంలో ఓ జీవి వుంది. కాకపోతే అందులో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. వాటిని గుర్తించి చెప్పండి.

# ప్రపంచంలోకెల్లా పొట్టి ఆవులు



ఆవు పాలంటే చాలా ఇష్టం కొందరికి. వాటి పిల్లలు లేగదూడలు మనతో భలేగా ఆడతాయి కదా. అయితే ఆవు మనకన్నా చాలా పెద్దగా ఉంటుంది. దాని దగ్గరకు వెళ్లాలంటే కాస్త భయంగానే ఉంటుంది. అయితే కేరళలోని వేచూర్ ఆవు మాత్రం చాలా చిన్నగా ఉండి భలే అనిపిస్తుంది మనకు. ఎంత పొట్టిగా ఉంటుందంటే మన ఎనిమిదో తరగతి పిల్లాడంతా ఎత్తు మాత్రమే ఉంటుంది. ఇప్పుడైతే దాని దగ్గరకు భయం లేకుండా వెళ్లొచ్చని అనుకుంటున్నారు కదా. అయితే, దాని గురించి మరికొన్ని విషయాలు తెలుసుకోండి.

- మన దేశంలోని కేరళకు చెందిన ఈ ఆవులు ప్రపంచంలోనే అతి పొట్టివి.
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో కూడా వీటిని నమోదు చేశారు.
- మీటరున్నర పొడవు, 87 సెంటీ మీటర్ల ఎత్తు ఉంటాయి- తక్కువ మేతను తిని ఎక్కువ పాలను ఇస్తాయి.
- డాక్టర్ సోసమ్మ ఐపే అనే శాస్త్రవేత్త వీటిని అంతరించిపోకుండా కాపాడింది.
- కేరళ కొట్టాయంలోని వేచూర్ ప్రాంతానికి చెందిన ఇవి ఓ ప్రత్యేక జాతి.
- అక్కడి నుంచి మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్నాటకకు కూడా తీసుకెళ్లారు.
- ఇప్పుడు కేవలం 200 ఆవులు మాత్రమే ఉన్నాయి.
- సోసమ్మ పనిచేసిన పశు వైద్య కళాశాలలోనే వంద వరకు ఆవుల్ని కాపాడుతున్నారు.
- వీటి పాలు తేలిగ్గా జీర్ణమవడంతో పిల్లలకు, రోగులకు పట్టిస్తారు.
- మిగతా ఆవు పాల కన్నా ఇవి చాలా ఆరోగ్యదాయకం.
- గుండె, మెదడు జబ్బుల్ని అరికట్టే వైద్య లక్షణాలు వీటి పాలల్లో ఉన్నాయని ఆయుర్వేదంలో తేలింది.
- వీటి పాలల్లోని ఆరోగ్యకారకాల వల్లే వీటికి అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది.
- స్థానికంగా దీన్ని పెళ్లి కానుకగా అందిస్తారు.
- వేడి వాతావరణంలో చక్కగా బతికే వీటిని చాలా మంది పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నా అవి దొరకడం లేదు.

# కార్మికోద్యమ చరిత్రపై సమగ్ర గ్రంథం

ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు, ప్రసిద్ధ రచయిత సుకోమల్ సేన్ బృహత్తర రచన 'భారత కార్మిక వర్గం –ఆవిర్భావం, ఉద్యమం, 1830–2010'. క్షుణ్ణంగా సవరించి, విస్తరించిన తృతీయ ప్రతికి తెలుగు అనువాదం ఇది. రచయిత తొలి ప్రతి ముందు మాటలో పేర్కొన్నట్లు ఇది సంప్రదాయ సిద్ధమైన ట్రేడ్ యూనియన్ చరిత్రలకు భిన్నమైనది. విస్తృతమైన జాతీయ, అంతర్జాతీయ నేపథ్యంలో భారత కార్మిక వర్గ పోరాటాలను రాజకీయాలు ఆర్థికాంశాల పరస్పర ప్రభావాలను గమనంలోకి తీసుకొని సాగిన రచన ఇది. భారత దేశంలో కార్మిక వర్గ ఆవిర్భావం, సంపన్న దేశాలలో కార్మిక వర్గ ఆవిర్భావానికి భిన్నమైన రీతిలో వలస పాలకులు పూర్తి ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో జరిగింది. అందుచేత భారత కార్మిక వర్గం పుట్టిన దగ్గర నుంచి ఒకవైపున వలసవాదుల రాజకీయ పాలనను రెండో వైపున దేశ, విదేశీ పెట్టుబడిదారుల ఆర్థిక దోపిడీని ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ విధంగా భారత కార్మికోద్యమం జాతీయ విముక్తి ఉద్యమంతో పెనవేసుకొని సాగింది. ఈ రకమైన సంబంధం 1947, ఆగస్టులో స్వాతంత్ర్యం లభించేవరకు కొనసాగింది. ఆ తర్వాత బడా బూర్జువా వర్గ ఆధిపత్యంలో భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణం జరుగుతున్న సమయంలో భారత కార్మికోద్యమం ముందుకు సాగింది. 1970 వరకు కొనసాగిన ఈ దశను తొలి ప్రతి వివరిస్తుంది. 1970 వ దశకం తర్వాత ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో చోటుచేసుకున్న మార్పుల పర్యవసానంగా ప్రపంచ కార్మికోద్యమ స్వరూప, స్వభావాలలో కూడా మార్పులు సంభవించాయి. దీనితో పాటు శాస్త్ర సాంకేతిక విప్లవం ఫలితంగా కూడ కార్మిక వర్గ నిర్మాణం మరింతగా మారిపోయింది. ఈ అంశాలను 1995 వరకు ద్వితీయ ప్రతిలో రచయిత వివరించారు.

ఈ పుస్తకం 2010 వరకు చోటుచేసుకున్న పరిణామాలను వివరిస్తుంది. నయా ఉదారవాద ప్రపంచీకరణ విధానాలు ఉధృతంగా కొనసాగుతున్న ఈ కాలంలో ప్రపంచ కార్మిక వర్గంతో పాటు భారత కార్మిక వర్గం కూడ అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నది. భారత ప్రభుత్వ కార్మిక వర్గ వ్యతిరేక వైఖరి, విధానాలు దానికి ప్రతిగా కార్మిక వర్గ పోరాటాలు ఉద్యమాలను తగు వివరాలతో రచయిత విశ్లేషించారు అంతేకాదు ఈ ప్రతి క్షుణ్ణంగా సవరించబడింది. భారత కార్మికోద్యమం తొలిరోజుల్లో కేరళ ట్రేడ్ యూనియన్ ఉద్యమం గురించి భారత దేశంలో కీలక పరిశ్రమల్లో ఒకటయిన బొగ్గు గనుల రంగంలో కార్మిక వర్గ ఉద్యమ ఆవిర్భావం గురించి కూడ వివరాలను రచయిత దీనిలో పొందుపరిచారు. ఎల్ఐసి ఉద్యమ నాయకులు కెకెడి హనుమంతరావు, ఎస్.ధనుంజయ రావు ఈ పుస్తక అనువాదకులు. భారత కార్మికోద్యమ చరిత్రను, దాని ప్రత్యేకతలను ప్రతిబింబించే ఇంతటి సమగ్ర గ్రంథం తెలుగులో మరొకటి లేదు. అలాంటి అపూరపమైన ప్రచురణ పాఠకులకు అందిస్తున్నందుకు ప్రజాశక్తి బుక్‌హౌస్‌వారు అభినందనీయులు.

**-స్నేహ**

**భారత కార్మికోద్యమ చరిత్ర**
**(1830-2010)- సుకోమల్‌సేన్,**
**పేజీలు: 834**
**ధర: 500/-**
**ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ తెలంగాణ, ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం: 21/1, ఆజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణ మండపం దగ్గర, హైదరాబాద్-20.**




**పరస (నవల)**

**రచన: డా॥ వి.ఆర్. రాసాని, పేజీలు: 103/-, వెల:75/-, ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ బ్రాంచీలు. మరియు డా॥కె. ఉమాదేవి. ఇంటి.నెం 16-2 ఇ/17 బాలాజీ రెసిడెన్సీ, మునిరెడ్డి నగర్, తిరుపతి-పడమర-517502.**

# ఛిద్రమవుతున్న గ్రామీణ జీవన దర్పణం

చతుర మాస పత్రికలో ప్రచురణ పొందిన ఈ నవలకు నాయని కృష్ణమూర్తి, తవ్వా ఓబుల్ రెడ్డి చక్కటి ముందు మాట రాశారు. సీమ ప్రాంత వ్యవసాయం/పశుపెంపకం/ కరువు, రక్కసి పరిస్థితులకు అద్దం ఈ నవల. పశువుల్ని కొనడానికి కొన్ని ఊళ్ళలో పరసలు జరుగుతాయి. ప్రస్తుతం ఈ పరసలు పశువులకే కాకుండా మనుషుల కోసం కూడా జరుగుతున్నాయి. ఈ మనుషుల పరసలు ప్రతి ఊళ్ళోను , ప్రతి రోజు జరుగుతున్నాయి. అని రచయిత తీర్మానిస్తాడు అంటారు నాయని ముందుమాటలో. బీ శేరయ్య ఓ సన్నకారు రైతు. 10 గొడ్లున్నాయి. పరసల్లో దళారుల వ్యవహారాలు గంగిరెడ్డుల వారి జీవన వ్యవహారాలు కళ్ళకు కట్టినట్టు రాశారు. బీ శేరయ్య బస్సు దిగటంతో నవల ఆరంభం అవుతుంది. బీ శేరయ్యతోనే ముగింపు రాశారు బాగుంది. ప్రపంచీకరణ పల్లెసీమల్ని ఎలా ఛిద్రం చేసేయో పాత్రలు, పరిసరాలు, బలమైన సన్నివేశాల్లో నవల చైతన్య పూరితంగా ఆలోచనాత్మకంగా సాగుతుంది. నవల సీమ వ్యవసాయ సంగతులు కథీకరించి దృశ్యమానం చేయడం ఆ ప్రాంత వాసులకే సాధ్యం. బీ శేరయ్య గంగిరెడ్డి ఆటను చూపెట్టడమే గాక అతని బతుకు ఆటను అక్షరీకరించిన తీరు ప్రశంసనీయం. బీ శేరయ్య బావి అప్పటికే అడుగంటింది. అతనికున్నది ముక్కాలెకర మడి. రెండు ఎకరాలు మెట్ట చేను. మెట్ట చేనులో వేరుశెనగ లేశాడు. కానీ ముక్కాలెకరా మడిలో అరెకరా బుచ్చిరెడ్డి పాళెం వడ్లు సగం పిచ్చొడ్లు సగం నాటుకున్నారు. మిగిలిన రెండు గుంటల్లో మిరప తోట నాటాడు. అది పూతిడిస్తూ వుంది. వరి మడి పొట్ట కర్ర పై నుంది. ఇంకా ఎలా లేదన్నా నెలపైనే నీళ్ళు పారాలి. కానీ అప్పుడే బావిలో నీళ్ళు అయిపోతున్నాయి. ఇప్పట్లో ఒక పదును వాన పడితే సాలు .పంటెల్లిపోతుంది. వానబడకపోతే సంసారం గతెట్లా? అని రోజూ ఆలోచిస్తూనే వున్నాడు. బీ శేరయ్య (పేజీ 20).ఇలా ఓ పల్లె రైతు కథను పశుసంపదను పోషించలేక సంతకు తోలే స్థితి. "పరస" నవల్లో అద్భుత కథనంతో రాసిన రాసాని కలంబలం పాఠకుల్ని ఆలోచింపజేస్తుంది. మాండలిక పదాలు గ్రామీణ పలుకుబడులు అన్ని ప్రాంత వాసులకు అర్థం అయ్యేలా ఫుట్ నోట్స్ ఇస్తే బాగుండేది. శేరయ్య పాత్ర 'సూత్రధారులు' చిత్రంలోని అక్కినేనిని గుర్తు చేస్తుంది. నవల ఆద్యంతం చదివిస్తుంది.

**-తంగిరాల చక్రవర్తి**

# కళ కన్నారా!

విసిరి కొట్టినట్టుండే మారుమూల నివాస ప్రాంతాలు, చిందర వందరగా వస్తువులతో నిండి ఉండే మైదానాలు, విరిగిన చెట్లను, స్తంభాల పక్కనుండి వెళ్లే రహదార్లు.. వీటిలో ఏదో మార్మికత. ఏదో ఒక అర్థానికి రానీకుండా చిత్రంగా తోస్తాయి. అమెరికన్ కళాకారుడు జిమ్ డింగిలియాన్‌ను కట్టిపడేసేదిదే. ఆ మార్మికత చెదరకుండా ఉండాలంటే అంతే మార్మికంగా దాన్ని కళ రూపంలో ప్రకటించాలని ఆయన ఆరాటం. దాని కోసం ఎంతో పరిశోధించాడు. చివరకు 19వ శతాబ్దంలో కనుమూసిన ఈ గాజు సీసాల కళ గుర్తొచ్చింది ఆయనకు. చాలా కష్టపడి దాన్ని నేర్చుకుని ఆ మార్మిక దృశ్యాలను ప్రకటించాడు. కొవ్వొత్తి పొగను గాజు సీసాలోకి పంపి దాన్ని పొగచూరేలా చేస్తారు. ఆ తర్వాత ఆయన పదిలపరచాలనుకున్న దృశ్యాన్ని గుర్తుంచుకుని ఒక్కో గీతతో పొగను చెరుపుతాడు. అలా బ్రష్ స్ట్రోక్‌లు, పుల్లలు వగైరా వస్తువులను ఉపయోగించి అవసరంలేని పొగచూరును తొలగిస్తాడు. మిగిలినవే ఈ చిత్రాలు. ఈ చిత్రాల్లోని మరో విశేషమేమిటంటే వాటి బోలు ఆకారమే కావాల్సిన డెప్త్‌ను తీసుకు వస్తుంది. వీటికి కావాల్సిన గాజు సీసాల్ని ప్రత్యేకంగా ఏమీ తయారు చేయించుకోడు. సరుకు ఖాళీచేసి పారేసిన మందు సీసాలే ముడి సరుకు. ఖర్చేలేని ఈ కళకు చాలా మేధను ఖర్చుచేయాల్సిందే. ఒక చెరుపు చెడినా మొత్తం చిత్రాన్ని మళ్లీ ప్రారంభించాల్సిందే. మళ్లీ పొగను అక్కడే చూరు కట్టించడం సాధ్యం కాదు కదా. యార్క్‌కు చెందిన జిమ్ డింగిలియాన్ చిన్నతనం ఏడేళ్లపాటు బెల్జియంలోని వాటర్లూలో గడిచింది. అక్కడి మారుమూల ప్రాంతాలు ఆయన్ను వెంటాడేవి. అమెరికాకు తిరిగి వచ్చాక ఆయన డెలవేర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసి ఫైన్ ఆర్ట్స్‌లో మాస్టర్స్‌ను రోచెస్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అభ్యసించాడు. ఈ గాజు సీసాల కళలాగే, ఉపయోగించి వదిలేసే దొరికిన వస్తువులపై కూడా కళాఖండాల్ని పదేళ్లుగా సృష్టిస్తున్నాడు. వీటితో పాటు ఆ వస్తువులను చాలా మ్యూజియాలు, కళా కేంద్రాల్లో ప్రదర్శించారు. వాల్థామ్‌లోని డి కార్డోవా అండ్ రోజ్ ఆర్ట్ మ్యూజియంలో వీటికి శాశ్వత చోటు కల్పించారు. న్యూయార్క్‌కు చెందిన మెకెన్జీ ఫైన్ ఆర్ట్‌కు డింగిలియాన్‌ను ప్రతినిధిగా నియమించింది.

●

# రాళ్లలో ఇసుకల్లో...

రాళ్లలో ఇసుకల్లో రాశాము ఇద్దరి పేర్లు.. అంటూ ఆత్రేయ ప్రేమలేఖ రాశాడు. అందం లేని ఆ రాళ్లలో, జారిపోయే ఆ ఇసుకల్లో ప్రేమ లేఖ రాసేం, రాయకేం అని రంగు కాగితాలకే పరిమితమవకండి ప్రేమికులు. వాటిలోనే ఓ రంగుల ప్రపంచం ఉంది. రంగు కాగితాల ప్రేమలేఖలు వెలవెలబోయే అందముంది. రాళ్లలో, ఇసుకల్లో మట్టి కప్పుకుని దాక్కుంది ఆ అందాల లోకం. ముడి ఖనిజాలైన ఇవి విభిన్న రంగుల్లో, ఆకృతుల్లో కట్టిపడేస్తాయి. సుమారు 4900 రకాల ఖనిజాలు భూమిలో ఉన్నాయని అంచనా. సిలికేట్, ఆక్సిజన్, నీరు కలబోతలో రంగుల్ని నింపుకున్నవే ఎక్కువ. భూమాత కొంగు ముడి కట్టిన ఈ ముడి ఖనిజాల అందాన్ని ఆరబోశాం ఆస్వాదించండి.